సంపుటి : 9
సంచిక : 284
మంగళవారం
07 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
Contact For Ads:
7579339999

# విశాఖలో 'బే సిటీ'..

## అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు

- అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం
- విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సమీక్ష
- ఏపీ సమగ్రాభివృద్ధికి త్రైపాక్షిక వ్యూహం
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళిక
- 6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆదేశం
- మూడు రీజియన్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ సిటీల ఏర్పాటు
- 51.88 చ.కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధికి కార్యాచరణ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఏర్పాటు చేసిన మూడు ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సోమవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉద్యాన పంటలతో కడప జిల్లా లింగాల మండలం సాధించిన అద్భుత ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని, మొత్తం రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతాలను తలదన్నేలా, లింగాల మండలంలో ప్రజల తలసరి ఆదాయం రూ. 7.30 లక్షలుగా ఉండటం ఉద్యాన పంటల సత్తాకు నిదర్శనమని సీఎం అన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (టీఈఆర్) అభివృద్ధికి హార్టికల్చర్ ఒక గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని, ఈ ప్రాంతంలో 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలని ఆదేశించారు.

**ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఇప్పటికే ఆవిష్కరించగా, రాబోయే ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్లకు కూడా మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ ముసాయిదా ప్రణాళికలను ప్రజలు, ప్రజాప్రతినిధుల ముందు ఉంచి, వారి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే తుదిరూపు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి జిల్లాకు రెండు నెలల్లోగా 'డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్' రూపొందించాలని

మిగతా .. 2లో..

## మోదీ విమానానికి

# ఎస్కార్ట్

ఫైటర్ జెట్‌తో ఇండోనేసియా ప్రత్యేక స్వాగతం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్రమోదీ ఇండోనేసియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని ఆ దేశం ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం జకార్తా గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. ప్రధాని మోదీ విమానాశ్రయానికి చేరుకోగానే ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తాను జకార్తా చేరుకున్నానని.. ప్రబోవో సుబియాంతో స్వాగతం పలికిన తీరు తనను ఎంతగానో కదిలించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో

మిగతా .. 2లో..

## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి

# సంబంధాలు లేవు

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటూ ప్రతిపక్షాలే లక్ష్యంగా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని వైసీపీ సీనియర్

మిగతా .. 2లో..

## నా రక్తంలోనే

# కాషాయం ఉంది

పేర్ని నాని విమర్శలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కౌంటర్!




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ నేత సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు మీడియాతో

మిగతా .. 2లో..

## దక్షిణ కొరియాలో వివిధ సంస్థల ప్రతినిధులతో

# మంత్రి నారా లోకేష్ భేటీ

**విశ్వం వాయిస్ న్యూస్ :** దక్షిణ కొరియాలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. ఆ దేశ రాజధాని సియోల్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలు, పారిశ్రామిక అనుకూలతలను లోకేశ్ వారికి వివరించారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ రంగాల్లో ఏపీని గ్లోబల్ హబ్‌గా నిలపడమే లక్ష్యంగా మంత్రి పర్యటన కొనసాగింది. తొలుత దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్, ఐఓటీ & పవర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ సోలమ్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ ఆఫీసర్ జీగాబ్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. శ్రీసిటీలో రూ.338కోట్లతో సోలమ్ సంస్థ




ఈవీ ఛార్జర్ పవర్ మాడ్యూల్స్, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్ యూనిట్ నిర్మిస్తున్నందుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. త్వరగా శ్రీసిటీ యూనిట్ నిర్మాణ పనులు పూర్తిచేసి ఉత్పత్తిని ప్రారంభించాలని కోరారు. అనంతరం

మిగతా .. 2లో..

## మత్స్యకారుల కోసం

# యుద్ధ నౌకలతో గాలింపు

ప్రతికూల వాతావరణంతో ఆటంకాలు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ తీరంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, రక్షణశాఖ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారడం, భీకర గాలులతో కెరటాలు ఎగసిపడుతుండటంతో గాలింపు చర్యలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. ప్రతికూల వాతావరణంలోనూ నేవీకి చెందిన మూడు హెలికాప్టర్లు, రెండు నౌకలతో 'సెర్చ్ అండ్ రెస్క్యూ'

మిగతా .. 2లో..

## విద్యుత్ బస్సుల నిర్వహణ

# ఆర్టీసీ ద్వారానే చేయాలి

ఏపీ ఆర్టీసీ ఐకాస డిమాండ్




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్టీసీ ద్వారానే విద్యుత్ బస్సుల నిర్వహణ చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో ఆర్టీసీ హౌస్‌లో అధికారులతో ఐకాస చర్చలు జరిపింది. 'స్త్రీ శక్తి' పథకానికి అవసరమైన మేర బస్సుల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేసింది. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అధికారులను ఐకాస సభ్యులు కోరారు. సుమారు 30 డిమాండ్లను అధికారుల ముందు ఉంచారు. ఐకాస నేతలతో

మిగతా .. 2లో..

## తుని చిన్నారి జ్ఞానేశ్వరి

# అదృశ్యం కేసులో కొత్త పరిణామం

పాప కనపడకుండా పోయిన రోజున కనిపించిన కియా కారు మళ్లీ ప్రత్యక్షం
అదే కారు తమ బంధువును ఢీకొట్టిందని కుటుంబ సభ్యుల ఆరోపణ
అనుమానాస్పద కారుపై దృష్టి సారించి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారంలో తీవ్ర కలకలం రేపిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు కొత్త మలుపు తిరిగింది. దాదాపు నెల రోజులుగా ఆచూకీ లేకుండా పోయిన ఈ కేసులో, తాజాగా ఓ అనుమానాస్పద కారుపై పోలీసుల దృష్టి పడింది. ఈ పరిణామంతో దర్యాప్తు మరో కోణంలో వేగవంతమైంది. వివరాల్లోకి వెళితే, సుంకర గణేశ్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి (2) జూన్ 6న వారు పనిచేస్తున్న పామాయిల్ తోటలో ఆడుకుంటూ అదృశ్యమైంది. అప్పటి నుంచి పోలీసులు గాలిస్తున్నా చిన్నారి జాడ తెలియరాలేదు. అయితే, పాప

మిగతా .. 2లో..

## ఏపీ తరపున మిస్ యూనివర్స్ ఇండియా పోటీలకు హైదరాబాదీ

# ఫసిహా నౌమన్




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌కు చెందిన మోడల్, ఇన్‌ఫ్లుయెన్సర్ ఫసిహా నౌమన్ ప్రతిష్ఠాత్మక 'మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ 2026' కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. తల్లి అయిన

మిగతా .. 2లో..

## బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించిన

# సంజయ్ దత్‌ను సన్మానించిన బాలకృష్ణ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ సోమవారం హైదరాబాద్‌లోని బసవ తారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఛైర్మన్, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ.. సంజయ్ దత్‌కు శాలువా కప్పి, జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ కుమార్తె, ఆసుపత్రి ట్రస్టీ అయిన నారా బ్రహ్మణి కూడా పాల్గొన్నారు. గతంలో క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సంజయ్ దత్ ఈ ఆసుపత్రిని సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, అత్యాధునిక చికిత్సా పద్ధతుల గురించి ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్‌పై

మిగతా .. 2లో..

## అయోధ్య ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా

# కృష్ణమోహన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అయోధ్య విరాళాల చోరీ ఘటన నేపథ్యంలో శ్రీ రామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్ నియమితులయ్యారు. చంపత్ రాయ్ రాజీనామాను ఆమోదించిన ట్రస్టు.. ఆయన స్థానంలో తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని ట్రస్టు కోశాధికారి గోవింద్ గిరి

మిగతా .. 2లో..

## విదేశాల్లో ప్రత్యేక ప్రతినిధులను

# నియమించిన ఏపీ ప్రభుత్వం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విదేశాల్లో ప్రత్యేక అనుసంధానకర్త, ప్రత్యేక ప్రతినిధులను ఏపీ ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ఉత్తర అమెరికా ప్రధాన అనుసంధానకర్తగా సతీష్ మండువ నియమితులయ్యారు. మధ్య ప్రాచ్య, తూర్పు దేశాల ప్రత్యేక ప్రతినిధిగా రాధాకృష్ణ రావి, ఐరోపా ప్రత్యేక ప్రతినిధిగా జయకుమార్ గుంటుపల్లి, మిగిలిన దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా శ్రీనివాస్ పల్లాపోతును ప్రభుత్వం నియమించింది.

## అంతర్జాతీయస్థాయిలో ఫ్యూచర్ సిటీ

# అటవీ భూముల అభివృద్ధి

తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తారామతి బారాదరి, దుర్గం చెరువులను పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పర్యాటకశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునీకీకరించాలని.. టూరిజం హబ్ డెవలప్‌మెంట్

మిగతా .. 2లో..

# మీ స్నేహాన్ని ఎప్పటికీ మరువలేం

భారత్‌కు ఇరాన్ కృతజ్ఞతలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమ మాజీ సుప్రీం ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన భారత ప్రతినిధులకు దిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. ఈ దుఃఖ సమయంలో ఇరాన్ ప్రజలకు అండగా నిలిచి.. తమ సానుభూతిని ప్రకటించిన భారత్‌ను మరిచిపోలేమని తెలిపింది. ఈ చర్య ఇరుదేశాల మధ్య స్నేహానికీ, అనుబంధానికీ ప్రతీక అని.. చారిత్రక, సాంస్కృతిక

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# విశాఖలో 'బే సిటీ'..

స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఉన్న వనరులు, అవకాశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు.

**'వైజాగ్ బే సిటీ'.. పర్యాటక సర్క్యూట్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో 51.88 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ'ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్-ఇన్నోవేషన్, గ్లోబల్ టాలెంట్-ఎలైట్ లివింగ్ అనే మూడు మూలస్తంభాలపై ఈ నగరాన్ని నిర్మించాలని సూచించారు. ఇక్కడ 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. రాబోయే మూడు నెలల్లో విశాఖలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. అరకు-పాడేరు-విశాఖను ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని, సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన నగరాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు.

**అమరావతి, తిరుపతి రీజియన్ల అభివృద్ధి**

రాష్ట్ర జనాభాలో 32 శాతం, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉన్న అమరావతి ఎకనామిక్ రీజియన్ (ఏఈఆర్) అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. మొత్తం 9 జిల్లాల పరిధిలోని ఈ రీజియన్‌లో ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు కొల్లేరు సరస్సును అభివృద్ధికి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మరోవైపు, విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీపడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఖనిజ సంపద, పుణ్యక్షేత్రాలు, విద్యాసంస్థలు, పర్యాటక ప్రాంతాలతో టీఈఆర్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయన్నారు. శ్రీసిటీ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, పునరుత్పాదక ఇంధనం, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఈ ప్రాంతం స్వర్గధామం కావాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో టీఈఆర్ వాటాను 0.90 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మూడు రీజియన్ల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ పాల్గొన్నారు.

**రావణ్‌తో వైసీపీకి ఎలాంటి**

# సంబంధాలు లేవు

నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ నేతలతో పాటు సోషల్ మీడియా యాక్టివిస్టులు, రాజకీయ విశ్లేషకులను భయభ్రాంతులకు గురిచేసేందుకే అక్రమ కేసులు, అరెస్టుల పర్వానికి తెరలేపారని ఆయన మండిపడ్డారు. వివాదాస్పద యూట్యూబర్ రావణ్ (జోసెఫ్), కేవీఆర్ వంటి వారికి తమ వైసీపీతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు లేవని అంబటి స్పష్టం చేశారు. అయినప్పటికీ ఒక సాధారణ యూట్యూబర్‌పై దేశద్రోహం, 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమన్నారు. చట్ట పరిధి దాటి ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవచ్చు కానీ, దారుణమైన సెక్షన్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. రావణ్‌ను శారీరకంగా అంతమొందించే ప్రయత్నాలు కూడా జరిగాయని అంబటి సంచలన ఆరోపణ చేశారు. ఈ కేసులో పిఠాపురం కోర్టుతో పాటు పలు న్యాయస్థానాలు రావణ్‌కు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకోవడం లేదన్నారు. రావణ్ తమ పార్టీ వ్యక్తి కాకపోయినప్పటికీ, బాధితుడిగా అతనికి వైసీపీ తరఫున అవసరమైన పూర్తి న్యాయ సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు. కేవీఆర్ అరెస్టు వ్యవహారంలో ఏపీ పోలీసులు కనీస చట్టపరమైన నిబంధనలు పాటించలేదని... అందుకే దౌర్జన్యంగా ప్రవర్తించిన ఏపీ పోలీసులపై ఏకంగా తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సోషల్ మీడియాపై అధికారిక దౌర్జన్యకాండ సాగుతోందని అంబటి విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కొందరు వ్యక్తులు అత్యంత అసభ్య పదజాలంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా... వారిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, చట్టం అందరికీ ఒకేలా ఎందుకు వర్తించడం లేదని నిలదీశారు.

# నా రక్తంలోనే కాషాయం ఉంది

మాట్లాడిన ఆయన.. పేర్ని నానిని 'చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకునే వ్యక్తి'గా అభివర్ణించారు. తాను రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మారే అవకాశవాదిని కాదని, తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే వ్యక్తినని స్పష్టం చేశారు. "నేను పదవుల కోసం ఆశపడే వ్యక్తిని కాదు. నా రక్తంలోనే కాషాయం, బీజేపీ సిద్ధాంతం ఉన్నాయి. సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఒక మంత్రిగా... ప్రభుత్వంపై చేసే అర్థరహితమైన విమర్శలను చూస్తూ ఊరుకోను" అని సత్యకుమార్ హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ ను తాను వ్యక్తిగతంగా ఎప్పుడూ దూషించలేదని... ఆయన అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైనే తన పోరాటమని చెప్పారు. జగన్ ఒక నిలకడ లేని మనిషి అని, రాజధాని విషయంలో ఆయన మాట్లాడుతున్న తీరు చూస్తుంటే కనీస అవగాహన లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం చేసి, అతి త్వరలోనే పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యాయని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వ్యవస్థను గాడిలో పెట్టాల్సి ఉందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి చిన్న సమస్య, ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

**విద్యుత్ బస్సుల నిర్వహణ**

# ఆర్టీసీ ద్వారానే చేయాలి

ఈడీ అడ్మిన్ బ్రహ్మానందరెడ్డి, ఈడీ ఇంజినీరింగ్ వర్మ, ఈడీ ఆపరేషన్స్ నాగేశ్వరరావు చర్చలు జరిపారు. అనంతరం స్పెషల్ సీఎస్, ఎండీలకు ఆ వివరాలను తెలపనున్నారు.

# అయోధ్య ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్

మీడియాకు వెల్లడించారు. అయోధ్య విరాళాల చోరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం నుంచి దాదాపు 3 గంటలకు పైగా కొనసాగిన ఈ సమావేశానికి ట్రస్ట్ ఛైర్మన్ నృత్యగోపాల్ దాస్‌తో పాటు తొమ్మిది మంది శాశ్వత సభ్యుల్లో ఏడుగురు హాజరు కాగా.. చంపత్ రాయ్, మిశ్రా మాత్రం హాజరు కాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం అనంతరం గోవింద్ గిరి మాట్లాడుతూ.. ఆలయంలో చోరీకి గురయ్యాయని చెబుతున్న విలువైన వస్తువులన్నింటినీ ప్రదర్శిస్తామన్నారు. చంపత్ రాయ్‌ను సమర్థిస్తూ.. తన దృష్టిలో ఆయన నిష్కళంకుడు అన్నారు. ఆలయ ఉద్యమం కోసం ఆయన చేసిన త్యాగాన్ని ప్రశంసించారు. విరాళాల చోరీకి పాల్పడిన దోషులకు కఠిన శిక్ష పడాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. సనాతనంపై ఆకస్మికంగా ప్రేమను ప్రదర్శిస్తున్న వారు హిందువులను విభజించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాగే, ఈ కేసులో దోషులుగా తేలిన వారికి తగిన శిక్షలు ఉంటాయని తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కృష్ణమోహన్ తెలిపారు. ఈ ఘటనతో తమ ప్రతిష్ఠ దెబ్బతిందన్న ఆయన.. ట్రస్టీలందరూ భక్తుల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు, ట్రస్టు లక్ష్యాలకు అనుగుణంగా విరాళాలను సమర్థంగా నిర్వహించేలా కృషిచేస్తారని తెలిపారు.

# మోదీ విమానానికి ఎస్కార్ట్

ముందుకు వెళ్తామన్నారు. ఇండోనేసియాలో పర్యటన ముగిసిన అనంతరం ప్రధాని మోదీ జులై 8న ఆస్ట్రేలియా చేరుకుంటారు. జులై 9న అక్కడ జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లనున్నారు.

# మంత్రి నారా లోకేష్ భేటీ

ఎపిటాక్సీ, మైక్రో ఎల్ఈడీ, పవర్ ఎలక్ట్రానిక్స్ మెటీరియల్ తయారీ సంస్థ సాఫ్ట్-ఈపీఐ సీఈవో సుంగ్ మిన్ హ్వాంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. భారత్‌లోని కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని.. డిస్‌ప్లే తయారీదారుల కోసం ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే-మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ స్టార్టప్ ఫౌండర్లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా "వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్" నినాదంతో ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలను సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భారతదేశ ఏఐ రాజధానిగా ఏపీని నిలపడమే తమ ధ్యేయమని చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఈ సందర్భంగా మంత్రి ఆహ్వానం పలికారు. ఆ తర్వాత హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ పవర్ సిస్టమ్స్ ప్రెసిడెంట్ యోకోటా తకేషితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాల కోసం తిరుపతి లేదా శ్రీసిటీ సమీపంలో స్విచ్‌గేర్లు, ఇతర విద్యుత్ పరికరాల తయారీ, అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో సియోల్ సెమీ కండక్టర్స్ సంస్థ డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

**మత్స్యకారుల కోసం**

# యుద్ధ నౌకలతో గాలింపు

ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోందని చెప్పారు. మత్స్యకారులు గల్లంతైన సమాచారం తెలిసిన వెంటనే ఇండియన్ కోస్ట్ గార్డ్, ఇండియన్ నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ బలగాలు రంగంలోకి దిగాయి. చైనా క్రూ నౌక సురక్షితంగా కాపాడిన బోటు యజమాని కారి చిన్నా ఇచ్చిన సమాచారమే.. మిగతా వారి ఆచూకీ విషయంలో ఇప్పుడు కీలకంగా మారింది. సమయం గడుస్తున్న కొద్దీ ఉత్కంఠ పెరుగుతుండటంతో ప్రభుత్వం రక్షణ యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. కోస్ట్‌గార్డ్‌కు చెందిన శక్తిమంతమైన యుద్ధనౌక 'ఐసీజీఎస్ కనకలతా బారువా' సముద్ర గర్భంలోకి వెళ్లింది. దీనికి అదనపు బలంగా విశాఖ బేస్ నుంచి 'ఐసీజీఎస్ వీర' నౌక కూడా రంగంలోకి దిగడంతో గాలింపు చర్యలు మరింత వేగవంతమయ్యాయి. ఈ ఆపరేషన్‌లో తూర్పు నౌకాదళం నుంచి నేవీకి చెందిన రెండు అధునాతన ప్రత్యేక నౌకలు నిరంతరాయంగా సముద్రంలో గాలింపు చర్యలు చేపడుతున్నాయి. సముద్రంపైనే కాకుండా, గగనతలం నుంచి కూడా నిఘా తీవ్రం చేశారు. నేవీకి చెందిన 'సీ కింగ్', కోస్ట్ గార్డుకు చెందిన 'ఏఎల్‌హెచ్' హెలికాప్టర్లు గాలింపు కొనసాగిస్తున్నాయి.

**విశాఖ తీరానికి సురక్షితంగా చేరుకున్న మత్స్యకారుడు కర్రి చిన్నా**

సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల్లో ఒకరు సురక్షితంగా తీరానికి చేరుకున్నారు. బోటు యజమాని కారి చిన్నాను సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో నేవీ హెలికాప్టర్ సాయంతో ఐఎన్ఎస్ డేగాకు రక్షణ సిబ్బంది తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు ప్రాథమిక పరీక్ష నిర్వహించి చిన్నా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు నిర్ధరించారు. అనంతరం మరిన్ని వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్స కోసం అంబులెన్స్‌లో షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిన్నాను ఆయన భార్య, కుటుంబ సభ్యులు కలిశారు. ఈ మొత్తం ప్రక్రియలో జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ నేవీ, కోస్ట్ గార్డ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ రక్షణ చర్యలను పర్యవేక్షించారు. గల్లంతైన మిగిలిన మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతాయని ఆయన తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన కారి చిన్నా (బోటు యజమాని), సీతోడు, చిన్నయ్య, అప్పలరాజు, గరగయ్య, చిన్న అమ్మోరు, భీమిలి మండలం నాగమయ్యపాలెంకు చెందిన బండియ్య సముద్రంలో వేటకు వెళ్లారు. ఈనెల 1న వేటకు వెళ్లిన వీరు.. తిరిగొస్తుండగా చేపలరేవుకు పది నాటికల్ మైళ్ల దూరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎత్తైన అల బోటును బలంగా కొట్టడంతో తిరగబడిపోయింది. అందులోని ఏడుగురు తిరగబడిన బోటును పట్టుకొని రాత్రి 9 గంటల వరకు సాయం కోసం ఎదురుచూశారు. ఆధారంగా ఉన్న బోటు చివరికి మునిగిపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈత కొడుతూ తేలియాడే ప్రయత్నం చేశారు. ఇంతలో పోర్టు యాంకరేజ్ పాయింట్‌లో ఉన్న యూనివర్స్ వెల్త్ అనే మర్చంట్ నౌక కనిపించడంతో నలుగురు దానివైపుగా వెళ్లారు. సమీపంలోకి వెళ్లిన బోటు యజమాని కారి చిన్నాను నౌక సిబ్బంది రక్షించగలిగారు. మిగతా వారు గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం అధికార యంత్రాంగం అన్ని విధాలుగా సహాయక చర్యలు కొనసాగిస్తోంది.

**తుని చిన్నారి జ్ఞానేశ్వరి**

# అదృశ్యం కేసులో కొత్త పరిణామం

అదృశ్యమైన రోజున ఓ కియా కారు అనుమానాస్పదంగా సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. ఇప్పుడు గత రెండు రోజులుగా అదే కారు మళ్లీ ఆ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండటంతో కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిన్న నర్సీపట్నం సమీపంలో తమ బంధువుల్లో ఒకరిని అదే కారు ఢీకొట్టిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు, ఈ కొత్త కోణంపై లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. అనుమానిత కారు వివరాలు, దాని కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

**ఏపీ తరఫున మిస్ యూనివర్స్ ఇండియా పోటీలకు హైదరాబాదీ**

# ఫసిహా నౌమన్

కొద్ది నెలలకే ఆమె ఈ ఘనత సాధించడం విశేషం. ఈ విజయంతో ఆమె ఈ నెలలో నిర్వహించనున్న 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. సుమారు ఎనిమిదేళ్ల విరామం తర్వాత అందాల పోటీల బరిలోకి దిగిన ఆమె, అద్భుత విజయన్ని అందుకున్నారు. వివాహితులు, తల్లులు సైతం అందాల పోటీల్లో పాల్గొనవచ్చని మిస్ యూనివర్స్ సంస్థ నిబంధనలను సవరించడం ఫసిహాకు తన కలను సాకారం చేసుకునే అవకాశాన్ని కల్పించింది. మిస్ యూనివర్స్ ఇండియా 2026 పోటీలు జులై 19 నుంచి ఆగస్టు 23 వరకు జరగనుండగా, ఢిల్లీలో గ్రాండ్ ఫినాలే నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన వారు నవంబర్‌లో ప్యూర్టోరికోలో జరగబోయే 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొంటారు. ఫసిహా 2018లో ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ పోటీల్లో టాప్-10 ఫైనలిస్ట్‌లలో ఒకరిగా నిలిచారు. అనంతరం ఎంబీఏ పూర్తి చేసిన ఆమె, సబ్యసాచి ముఖర్జీ వంటి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన డిజైనర్ల వద్ద మోడల్‌గా పనిచేశారు. వివాహమై, బిడ్డకు జన్మనిచ్చిన మూడు నెలలకే తిరిగి పోటీలకు సిద్ధమవడం ఆమె అంకితభావానికి, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది. "నా కుమారుడిని చూసిన ప్రతిసారీ, నేను ఈ ప్రయాణాన్ని ఎందుకు ప్రారంభించానో గుర్తుకు వస్తుంటుంది. పట్టుదల ఉంటే వృత్తిపరమైన లక్ష్యాలను, కుటుంబాన్ని సమతుల్యం చేసుకోవడం సాధ్యమేనని నా బిడ్డ తెలుసుకోవాలని కోరుకుంటున్నాను" అని ఫసిహా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె జాతీయ స్థాయి పోటీల కోసం కమ్యూనికేషన్, ఫిట్‌నెస్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తన అనుభవం, పరిణితితో పోటీల్లో ప్రత్యేకతను చాటుకోవాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే 'ప్రాజెక్ట్ ఉడాన్' ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి, వారి ఆర్థిక స్వావలంబన కోసం ఆమె కృషి చేస్తున్నారు.

**బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించిన**

# సంజయ్ దత్‌ను సన్మానించిన బాలకృష్ణ

పోరాటంలో బసవతారకం ఆసుపత్రి చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. క్యాన్సర్ కేర్ మిషన్‌పై సంజయ్ దత్ చూపిన ఆసక్తికి ధన్యవాదాలు తెలుపుతూ నారా బ్రహ్మణి ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. "ఈ రోజు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించిన సంజయ్ దత్ గారికి ధన్యవాదాలు. మా నాన్నగారు నందమూరి బాలకృష్ణతో కలిసి మీకు స్వాగతం పలకడం సంతోషంగా ఉంది. ఆసుపత్రి లక్ష్యాలు, సేవలపై మీరు చూపిన ఆసక్తిని మేము ఎంతో అభినందిస్తున్నాము. అవసరమైన వారికి ఆశ, స్వస్థత, నాణ్యమైన క్యాన్సర్ చికిత్స అందించాలనే మా ఆశయానికి మీ పర్యటన మరింత బలాన్నిచ్చింది" అని బ్రహ్మణి తన పోస్టులో పేర్కొన్నారు.

**అంతర్జాతీయస్థాయిలో ఫ్యూచర్ సిటీ**

# అటవీ భూముల అభివృద్ధి

పథకం కింద వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అక్కడ వీరభద్ర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు యాదగిరిగుట్ట తరహాలో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. "క్యూర్ పరిధిలోని అటవీశాఖ భూములను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలి. గుర్రంగూడ ఎకో పార్కు తరహాలో నగరంలో మరిన్ని పార్కులను తీర్చిదిద్దాలి. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలి. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకాధికారులను నియమించాలి. పురానాపూల్, హెరిటేజ్ బ్రిడ్జిలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. ట్రాఫిక్‌ను మళ్లించి బ్రిడ్జిపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి. డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్ ఏర్పాట్లు ప్రారంభించాలి" అని సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు.

# మీ స్నేహాన్ని ఎప్పటికీ మరువలేం

సంబంధాలను ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఇరుదేశాల మధ్య ఉన్న ఈ చిరకాల బంధాన్ని, స్నేహాన్నీ ఇరాన్ ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని పేర్కొంది. ఇరాన్ దివంగత సుప్రీం నేత ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆయన భౌతికకాయాన్ని రాజధాని టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా మసీదులో ఉంచారు. దేశ విదేశీ ప్రతినిధులు, అధికారులు ఆయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. భారత్ తరఫున బిహార్ గవర్నర్, సయ్యద్ అతా హస్నైన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటా నివాళులర్పించారు. కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీతో పాటు భారత్‌కు చెందిన సిక్కు, హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు అంత్యక్రియలకు హాజరయ్యారు. ఖమేనీ పార్థివ దేహాన్ని ఆయన సొంత పట్టణం మషహద్‌లో ఈనెల 9న ఖననం చేయనున్నారు.

**ఎపి సచివాలయంలో ఓటర్ల జాబితా**

# ప్రత్యేక సమగ్ర సవరణ శిబిరాన్ని ప్రారంభించిన సిఇఓ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేది వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ప్రారంభించారు. ఎపి సచివాలయం మూడవ భవనం అప్సా(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ఏర్పాటు చేసిన ఈశిబిరాన్ని ఆయన ప్రారంభించి ఉద్యోగుల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈశిబిరాన్ని ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ సూచించారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్లైన్ సబ్ మిషన్, కొత్త ఓటర్లు ఎన్రోల్మెంట్, ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లు తొలగింపు, చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు, తాజా ఫోటో, ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు)ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో వచ్చి వారి ఓటరు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అనంతరం ఈప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ఓటరు వివరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సిఇఓ వివేక్ యాదవ్ ఓటరు గుర్తింపు ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలక్టర్ సాయి కాంత్ వర్మ, గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జాయింట్ సిఇఓ ఇ.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## 'సర్' సగం కన్నా తక్కువే..!

కేంద్ర ఎన్నికల సంఘం ఏపీ లో చేపట్టిన ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ అత్యంత మందకొడిగా సాగుతోంది. మరో వారం రోజుల్లో(జూలై 14) ఈ ప్రక్రియ ముగిసిపోనుంది. కానీ, ఇప్పటి వరకు సగం మందికి తక్కువగానే 2002కు సంబంధించిన వివరాలను ఎన్నికల సంఘానికి అప్పగించడం గమనార్హం. ఈ ప్రక్రియ ఆధారంగానే కొత్త జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది.

ప్రస్తుతం రంపచోడవరం, పాడేరు, విశాఖ, విజయవాడ.. ఇలా అత్యంత కీలకమైన నియోజకవర్గాల్లో 36 శాతం మంది మాత్రమే ప్రజలు తమ వివరాలను ఇవ్వగలిగారు. వీటిలో ఎన్ని అమలుకు నోచుకుంటా యన్నది ఎన్నికల సంఘం పరిశీలన తర్వాతే తేలుతుంది. మరీ ముఖ్యంగా టీడీపీ, వైసీపీలకు బలం ఉన్న చోట కూడా.. ఇదే తరహా పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీని కి కారణం.. 2002నాటి ఓటర్ల జాబితాలో పేర్లు కనిపించకపోవడమే. కానీ, ప్రస్తుతం ఇస్తున్న ఫారాల్లో ఆ వివరాలే నింపాలని ఎన్నిక లసంఘం కోరింది.

ఈ వివరాలు లేని వారు.. ఏం చేయాలన్న దానిపై అవగాహన కల్పించే నాయకులు కానీ, అధికారులు కానీ లేకపోవడంతో ప్రజలు కూడా లైట్ తీసుకుంటున్నారు. ఫలితంగా.. ఈ ప్రక్రియ ప్రారంభమైన 15 రోజుల తర్వాత కూడా.. 40 శాతం లోపు మాత్రమే అధికారులకు వివరాలు చేరాయంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇదే కొనసాగితే.. మరో వారంలో ముగియనున్న ఈ క్రతువులో రాష్ట్రంలోని సగం మందికంటే ఎక్కువగానే ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని అంటున్నారు.

### ఎవరికి నష్టం?

ప్రస్తుతం కొనసాగుతున్న సర్ ప్రక్రియ ఇలానే కొనసాగితే.. అంతిమంగా అది అధికార, ప్రతిపక్ష పార్టీలకే నష్టం చేకూర్చనుందన్న విషయం స్పష్టమవుతోంది. వైసీపీ అధినేత పైకి చెప్పినా.. క్షేత్రస్థాయిలో నాయకులు మాత్రం ఈ కార్యక్రమాన్ని లైట్ తీసుకున్నారు. ఇక, టీడీపీ లో కొంత మెరుగుదల కనిపిస్తోంది. కానీ, ఇంకా పుంజుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఎలా చూసు కున్నా.. మరో వారంలోగానే దూకుడు పెంచాలి. లేకపోతే.. 50-60 శాతం ఓట్లు మాత్రమే మిగ లనున్నాయన్న విషయం చర్చనీ యాంశంగా మారింది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్





భార్యతో వీడియో కాల్ మాట్లాడుతూ..

## రైలు కింద పడి భర్త ఆత్మహత్య



**కాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రైలు పట్టాలపై నిలబడి ఎదురుగా వస్తున్న రైలును వీడియో కాల్‌లో భార్యకు చూపిస్తూ రాజేశ్ నాయక్ (45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి వరంగల్ జిల్లా కాజీపేట సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజేశ్ నాయక్.. వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరిగా పని చేస్తున్నారు. కొంతకాలంగా ఆస్తి పంపకాల విషయంలో భార్య, తల్లిదండ్రుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రాజేశ్ ఆదివారం రాత్రి భార్యతో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. రైలు పట్టాల మీద నిలబడి భార్యకు వీడియో కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు తెలిపాడు. కాగా, రాజేశ్ తనను బెదిరిస్తున్నాడని ఆమె ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకుంది. తల్లిదండ్రులు రాత్రంతా అతడి కోసం వెతికారు. ఇవాళ ఉదయం రైలు పట్టాలపై ఎవరో మృతి చెందినట్లు తెలుసుకున్న కుటుంబసభ్యులు వెళ్లి చూడగా.. రాజేశ్ మృతదేహంగా తేలింది. మృతుడికి కుమారుడు ఉన్నాడు.

## రావణ్ ఫోన్‌లో మావోయిస్టు భావజాలం

### హిడ్మాను కీర్తిస్తూ ప్రసంగాలు : రిమాండ్ రిపోర్ట్





**గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చులకూరి జోసెఫ్) రిమాండ్ రిపోర్టులో గన్నవరం పోలీసులు కీలక అంశాలు పేర్కొన్నారు. యువత, విద్యార్థులను రావణ్ రెచ్చగొడుతున్నాడని.. అతడిపై తెలుగు రాష్ట్రాల్లో అనేక కేసులు నమోదయ్యాయన్నారు. "నిషేధిత మావోయిస్టు సంస్థ వైపు యువతను ఆకర్షించేలా రావణ్ ప్రకటనలు చేస్తున్నారు. మతపరమైన విభేదాలు రెచ్చగొట్టేలా అతడి తీరు కనిపిస్తోంది. రాష్ట్రంలో అశాంతి సృష్టించాలనే ఉద్దేశం ఉంది. ఇటీవల ఏలూరులో జరిగిన దళిత క్రైస్తవ సమావేశంలో రెచ్చగొట్టేలా రావణ్ మాట్లాడారు. అవమానకరమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. పదవుల్లో ఉన్నవారిని దూషించారు. వ్యవస్థలపై ప్రజల్లో ద్వేషం, వైషమ్యాలు సృష్టిస్తున్నారు. మావోయిస్టు భావజాలాన్ని అతడి ఫోన్‌లో గుర్తించాం. మావోయిస్టు హిడ్మాను కీర్తిస్తూ ప్రసంగాలు చేశారు. దేవుళ్లను అవమానించడం, కించపరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. రావణ్ పేరు పెట్టుకోవడం కూడా అందులో భాగమే. అతడికి సహకరిస్తున్నవారెవరో తేల్చాల్సి ఉంది. విచారణకు నిందితుడు సహకరించడం లేదు." అని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసేలా, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదుతో రావణ్‌పై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. గన్నవరానికి చెందిన జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతకు భంగం కలిగిస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారంటూ బీఎన్ఎస్‌లోని 152 సహా పలు సెక్షన్లు, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టంలోని (ఉపా) సెక్షన్ల కింద ఆయనపై అభియోగాలు మోపారు. ఆదివారం సాయంత్రం రావణ్‌ను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈనెల 18 వరకు రిమాండ్ విధించారు.

## 11 ఏళ్ల బాలికపై అత్యాచారం

### నిందితుడిని కొట్టి చంపిన స్థానికులు

**బరుయ్‌పుర్, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమబెంగాల్‌లో దారుణం చోటుచేసుకుంది. దక్షిణ 24 పరగణాల జిల్లా బరుయ్‌పుర్‌లో శనివారం అదృశ్యమైన 11 ఏళ్ల బాలిక మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఆ బాలికపై అత్యాచారం జరిగినట్లుగా ఆధారాలు లభించాయి. ఆ తర్వాత హత్య చేసినట్లు వెల్లడైంది. దీనికి కారకుడని పేర్కొంటూ ఓ వ్యక్తిని స్థానికులు కొట్టి చంపారు. బాలిక మృతదేహాన్ని ఆదివారం ఉదయం సూర్యపుర్ హాట్ ప్రాంతంలో ఓ సంచిలో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు బరుయ్‌పుర్-జయనగర్ రహదారిపై ఆందోళన చేపట్టారు. పోలీసు వాహనాన్నీ ధ్వంసం చేశారు. హత్యాచార ఘటనకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసు..

## డీఎస్పీ భీంరెడ్డి అరెస్ట్





**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదాయానికి మిం చిన ఆస్తుల కేసులో పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (పీసీఎస్) డీఎస్పీ సంకిరెడ్డి భీంరెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వైద్యపరీక్షల అనంతరం నాం పల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తీసుకెళ్లారు. కాసేపట్లో ఆయన్ను జడ్జి నివాసంలో హాజరుపరచనున్నారు. ఇటీవల భీంరెడ్డి నివాసంతో పాటు 16 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. భారీగా అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. లభించిన ఆధారాలు, పత్రాలను పరిశీలించారు. అనారోగ్యం కారణంగా భీంరెడ్డిని అరెస్ట్ చేయకుండా ఏసీబీ ఇటీవల నోటీసులు ఇచ్చింది. తాజాగా ఆయన్ను అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుతో భీంరెడ్డిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. హైదరాబాద్ ఇబ్రహీంబాగ్ వెసెల్లా మెడోస్‌లోని విల్లాలో ఉంటున్న భీంరెడ్డి ఇంట్లో ఏసీబీ హైదరాబాద్ సిటీ రేంజ్-1 డీఎస్పీ మాజిద్‌ఖాన్ నేతృత్వంలోని బృందం చేపట్టిన తనిఖీల్లో ఆదాయానికి మించిన ఆస్తులు భారీగా బయటపడ్డాయి. దాదాపు 20చోట్ల స్థిరాస్తుల్ని గుర్తించడం కలకలం రేపింది. బెంగళూరు మహానగరంలో భీంరెడ్డికి సంబంధించి.. ఎకరా వాణిజ్యస్థలం, కర్ణాటకలో 44 ఎకరాల వ్యవసాయ భూములున్నట్లు గుర్తించారు. ఆయన పేరిట లభించిన స్థిరాస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

## ఆయువు తీసిన ఆర్థిక, ఆరోగ్య సమస్యలు

### రైలుకు ఎదురెళ్లి ఒకే కుటుంబంలోని నలుగురి ఆత్మహత్య



**ఉంగుటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక, ఆరోగ్య సమ స్యలు ఓ కుటుం బాన్ని బలి తీసుకున్నాయి. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు రైల్వేస్టేషన్ వద్ద శనివారం అర్ధరాత్రి విగతజీవులుగా పడి ఉన్న నలుగురూ ఒకే కుటుంబానికి చెందినవారిగా జీఆర్పీ పోలీసులు నిర్ధారించారు. మృతులు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఆరో వార్డుకు చెందిన షేక్ చాంద్‌బాషా(50), అతడి భార్య హసీనా(45), కుమార్తెలు షర్మిల(23), సమీరా(20)గా గుర్తించారు. చాంద్‌బాషా స్థానికంగా కళ్లజోళ్ల దుకాణం నడుపుతున్నారు. పెద్ద కుమార్తె షర్మిల ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇంటర్ వరకు చదివిన రెండో కుమార్తె సమీరాకు గతేడాది అక్టోబరులో పెళ్లి చేశారు. ఆదాయం అంతంతమాత్రమే వస్తుండటం, అప్పులు పెరిగిపోవడంతో ఆర్థిక సమస్యలు మొదలయ్యాయి. దీనికితోడు చాంద్‌బాషా గుండె సంబంధిత, భార్య హసీనా మధుమేహం, రక్తపోటు, కాలేయ సమస్యలు, షర్మిల ఫిట్స్‌తో బాధపడుతున్నారు. ఈనేపథ్యంలో నలుగురూ శనివారం రాత్రి తాడేపల్లిగూడెం నుంచి చేబ్రోలుకొచ్చారు. చర్లపల్లి నుంచి షాలిమార్ వెళ్తున్న ప్రత్యేక రైలుకెదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కాకినాడ జీఆర్పీ సీఐ శ్రీనివాసరెడ్డి, తాడేపల్లిగూడెం ఎస్సై అప్పారావు తెలిపారు.

## హత్య కేసులో 40 ఏళ్ల తర్వాత అరెస్టు

**కొల్లం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేరళలోని కొల్లం జిల్లాలో బావను నరికి చంపి.. 40 ఏళ్లుగా పరారీలో ఉన్న మోహనన్ పిళ్లై (65) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. 1987 జనవరి 11న ఈ హత్య జరిగింది. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన మోహనన్ తన బావ చంద్రశేఖరన్ పిళ్లైతో గొడవకు దిగి నరికి చంపినట్లు పోలీసులు తెలిపారు. అప్పట్నుంచీ పరారీలో ఉన్న మోహనన్.. అజ్ఞాతంలో ఓ మహిళను పెళ్లాడాడు. వీరికి పిల్లలు ఉన్నారు. కొట్టాయం జిల్లాకు చేరి మారుపేరుతో జీవనం సాగిస్తున్న నిందితుడు ఇటీవల చికిత్స కోసం స్థానిక వైద్య కళాశాల ఆసుపత్రికి వెళ్లినపుడు కొల్లం జిల్లాకు చెందిన పాత మిత్రుడు కనిపించగా క్షేమ సమాచారాలు ఆరా తీశాడు. ఈ సమాచారంతో పోలీసులు మోహనన్‌ను అరెస్టు చేశారు.




# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు



కాకినాడ జిల్లా



తూర్పు గోదావరి జిల్లా



డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా



మంగళవారం, 07 జూలై, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బద్ధత

www.viswamvoice.com


# దోచింది కొండంత... పెనాల్టీ గోరంత!




- అక్రమ గ్రావెల్ తవ్వకాలపై అధికారుల కంటి తుడుపు చర్యలేనా.?
- మైన్స్, రెవెన్యూ శాఖల తీరుపై గ్రామస్తుల తీవ్ర ఆగ్రహం
- జిల్లా కలెక్టర్ జోక్యంతో సమగ్ర విచారణకు డిమాండ్
- తహశీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేసిన గ్రామస్తుడు




సీజ్ చేసిన జేసీబీ, జరిమానా రూ. 1.40 లక్షలు



ధ్వంసమైన పుష్కర కాలువ పరివాహక ప్రాంతం



స్పందనలో తహశీల్దారుతుకు గ్రామస్తుడు యనమల శంకిరుడు ఫిర్యాడు

## జిల్లా కలెక్టర్ జోక్యంతో సమగ్ర విచారణకు గ్రామస్తుల డిమాండ్!

"గొల్లప్రోలు మండలంలో పోలవరం కాలువ సమీపంలో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాల వ్యవహారం అధికార యంత్రాంగం పనితీరుపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. కోట్ల రూపాయల విలువైన గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి తరలించినప్పటికీ, కేవలం రూ.1.40 లక్షల జరిమానాతో వ్యవహారాన్ని ముగించడం వెనుక అధికారుల నిర్లక్ష్యం లేదా కుమ్మక్కు ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్తుల ఫిర్యాదు అనంతరమే అధికారులు స్పందించడం, తవ్వకాల పరిమాణాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయకుండానే జరిమానా విధించడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ స్వతంత్ర విచారణకు ఆదేశించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు"

**గొల్లప్రోలు విశ్వం వాయిస్ న్యూస్ :**
గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలో పోలవరం కాలువ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తవ్వి భారీ ఎత్తున తరలించిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీర్ఘకాలంగా యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగుతున్నప్పటికీ రెవెన్యూ, మైన్స్, రవాణా శాఖల అధికారులు స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేసిన తర్వాతే అధికారులు రంగంలోకి దిగి వాహనాలను సీజ్ చేసి, రూ.1.40 లక్షల జరిమానా విధించడంతో వ్యవహారాన్ని ముగించారని విమర్శలు వినిపిస్తున్నాయి. మైన్స్ శాఖ అధికారులు తవ్వకాల ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే జరిమానా ఎలా నిర్ణయించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎంత మేర గ్రావెల్ తవ్వారు? ఎన్ని లోడ్లు తరలించారు? ప్రభుత్వానికి ఎంత మేర నష్టం జరిగింది? అక్రమంగా తరలించిన గ్రావెల్ ఎక్కడ వినియోగించారు? వంటి అంశాలపై సమగ్ర విచారణ జరగలేదని గ్రామస్తులు చెబుతున్నారు. రోజూ అక్రమ రవాణా కొనసాగుతున్నప్పటికీ దానిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మైన్స్, రవాణా శాఖలు ఎందుకు మౌనం వహించాయనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం లేదా కుమ్మక్కు కారణంగానే అక్రమ తవ్వకాలు నిరాటంకంగా సాగాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి భారీ నష్టం కలిగిన ఈ వ్యవహారంలో కేవలం నామమాత్రపు జరిమానా విధించడం ద్వారా అసలు బాధ్యులను కాపాడే ప్రయత్నం జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి స్వతంత్ర విచారణ జరిపించాలని, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌తో పాటు అక్రమ తవ్వకాలకు సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తుడు యనమల శంకరుడు గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ లో తహశీల్దారుకు పిర్యాదు చేశారు.

గోదావరి పుష్కరాల సన్నాహకాలపై

## ఆర్టీసీ అధికారులతో ఎంపీ సమీక్ష



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మధుర్ బాలయోగి సోమవారం ఏపీఎస్ ఆర్టీసీ అమలాపురం డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా అమలాపురం బస్టాండ్ ఆధునీకరణ పనులతో పాటు గోదావరి పుష్కరాలు-2027కు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణా సౌకర్యాలు, ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు, ప్రత్యేక బస్సుల నిర్వహణ, బస్టాండ్ అభివృద్ధి పనులపై అధికారులతో ఎంపీ చర్చించారు. ఆధునిక సౌకర్యాలతో అమలాపురం బస్టాండ్‌ను అభివృద్ధి చేసే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జి.సత్యనారాయణ, డిపో మేనేజర్ డి.ఎల్.ఎన్. శర్మ, ఏఈ శేషగిరి, సూపర్‌వైజర్ వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో

## 300 మందికి అన్నదానం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ సిటీ ప్రాంతాలలో శ్రీమతి అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అన్నదానం చీడిగ-ఇంద్రపాలెం ప్రతి మొద టివారం అన్నదాన కార్యక్ర మం నిర్వహిస్తోంది. సోమవారం జరిగిన మహా అన్నదానం కార్యక్రమంలో 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి డొక్కా సీతమ్మ సేవా సమితి కన్వీనర్ వాసంశెట్టి నాగేంద్ర, ఉపాధ్యక్షులు వడ్డాది లక్ష్మీ కళ్యాణం, కార్యదర్శి నరాల శివ, కే. సతీష్, కర్రి నూకరాజు, కాదా రమణ, కావూరి సత్యనారాయణ, కాళ్ళూరి కృష్ణమోహన్, చీమలకోండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో కాగ్నిజెంట్.. విశాఖ ఐటీ సెజ్‌కు

## కేంద్రం ఆమోదం

మధురవాడలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో దీని ఏర్పాటు
తెలంగాణలో రెండు సెజ్‌ల ప్రతిపాదనలను వెనక్కి తీసుకున్న సంస్థ
ఈ ప్రాజెక్ట్‌తో భారీగా ఉద్యోగాలు వస్తాయని అంచనా
సెజ్‌ను ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోగా ప్రకటించిన కేంద్రం





**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగాన్ని పరుగులు పెట్టించే కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్.. విశాఖపట్నంలో ఐటీ/ఐటీఈఎస్ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు పొందింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ జూన్ 25నే తుది నోటిఫై చేసింది. విశాఖపట్నం రూరల్ మండలం పరిధిలోని ఐటీ-మధురవాడ-2 ప్రాంతంలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి జూన్ 11న కాగ్నిజెంట్ సంస్థకు లెటర్ ఆఫ్ అప్రూవల్ కూడా జారీ అయింది. సెజ్ చట్టం ప్రకారం డెవలప్‌మెంట్ కమిషనర్ నేతృత్వంలో ఒక అప్రూవల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కస్టమ్స్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఈ సెజ్‌ను 'ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో'గా కూడా ప్రకటించడం విశేషం. కొన్ని నెలల క్రితం, ఫిబ్రవరిలో, తెలంగాణలోని నానక్‌రామ్‌గూడ, ఆదిభట్లలో రెండు ఐటీ సెజ్‌ల ప్రతిపాదనలను కాగ్నిజెంట్ వెనక్కి తీసుకుంది. ఆ తర్వాత ఇప్పుడు విశాఖలో భారీ ప్రాజెక్ట్‌కు అనుమతులు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రాజెక్ట్‌తో సుమారు రూ.1,580 కోట్ల పెట్టుబడి, దాదాపు 8,000 ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. దశలవారీగా పూర్తిస్థాయి క్యాంపస్‌ను అభివృద్ధి చేయనుండగా, విశాఖపట్నం ఐటీ స్వరూపాన్ని ఈ ప్రాజెక్ట్ సమూలంగా మార్చనుందని నిపుణులు భావిస్తున్నారు.

## త్వరలో 'నేతన్న భరోసా' పథకం అమలు

చేనేత సంఘాలకు రూ.6.50 కోట్ల బకాయిల చెల్లింపు
మంగళగిరిలో ఘనంగా ఆప్కో స్వర్ణోత్సవ వేడుకలు : రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత




**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా 'నేతన్న భరోసా' పథకాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సహకార సంఘం (ఆప్కో) స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం మంగళగిరిలోని ఆప్కో తోటలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత నేతన్నలకు పలు శుభవార్తలు ప్రకటించారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.6.50 కోట్ల బకాయిలను రెండు విడతల్లో విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. ఈ నెల 15న సంక్షేమ హాస్టళ్లకు సరఫరా చేసిన వస్త్రాలకు సంబంధించిన రూ.4 కోట్లు, ఆగస్టు మొదటి వారంలో సాధారణ చేనేత ఉత్పత్తులకు సంబంధించిన రూ.2.50 కోట్లు చెల్లిస్తామని చెప్పారు. నేతన్నల పెట్టుబడి భారం తగ్గించేందుకు ఆప్కో ద్వారా నూలు సరఫరా చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. చేనేత కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆప్కోను పూర్వ వైభవంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టిందని మంత్రి తెలిపారు. డిజిటలైజేషన్, కంప్యూటరైజ్డ్ బిల్లింగ్, ఆధునిక నిల్వ నిర్వహణ వంటి చర్యలతో ఆప్కోకు స్కోచ్ అవార్డు-2025 లభించిందన్నారు. నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రెడీమేడ్ చేనేత వస్త్రాల తయారీకి నేతన్నలకు శిక్షణ ఇస్తున్నామని, డైయింగ్, బ్లీచింగ్, నేత ఛార్జీలను కూడా పెంచామని చెప్పారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ చేనేత రంగానికి బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తున్నారని మంత్రి సవిత అన్నారు. చేనేత కార్మికులకు 50 ఏళ్ల నుంచే రూ.4 వేల పెన్షన్, ఏటా రూ.5 కోట్ల థ్రిఫ్ట్ ఫండ్, ఆప్కో కొనుగోలు చేసే వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ మినహాయింపు, 15 శాతం సబ్సిడీతో నూలు వంటి పలు సంక్షేమ చర్యలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో (టీటీడీ) ఆప్కో తొలిసారిగా ఒప్పందం కుదుర్చుకుందని మంత్రి తెలిపారు. ఆసక్తి ఉన్న చేనేత సహకార సంఘాలకు టీటీడీకి అవసరమైన దుశ్శాలువాలు, చీరలు, జాకెట్లు, కండువాల సరఫరా ఆర్డర్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా మాట్లాడుతూ చేనేత రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. మార్కెటింగ్ అవకాశాలు పెంచడంతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై నేతన్నలకు శిక్షణ ఇస్తున్నామని, ఆప్కోను మరింత బలోపేతం చేసి చేనేత కుటుంబాల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆప్కో మేనేజింగ్ డైరెక్టర్ కె. కన్నబాబు మాట్లాడుతూ సంస్థను ఆధునికీకరించడంతో పాటు ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చేనేత సహకార సంఘాలతో సమన్వయం పెంచి నేతన్నలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత సహకార సంఘాల ప్రతినిధులను మంత్రి సవిత సత్కరించారు. ఆప్కోలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రూ.1.20 లక్షల విలువైన రిటైర్మెంట్ బెనిఫిట్ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ నందం అబద్ధయ్య, కార్పొరేషన్ చైర్మన్లు పేరేపి ఈశ్వర్, ఆకాశపు స్వామి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ధనుంజయరావు, చేనేత, జౌళి శాఖ అధికారులు, ఆప్కో ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నేతన్నలు పాల్గొన్నారు.

# ప్రతిభకు వేదికగా అమరావతి ఛాంపియన్‌షిప్ - 2026




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'అమరావతి ఛాంపియన్‌షిప్-2026' పోస్టర్‌ను అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిడియా దేవి, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలోని యువతీ యువకులు, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ ఛాంపియన్‌షిప్ మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలను జిల్లాలో విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, క్రీడా సంఘాల ద్వారా అర్హులైన క్రీడాకారులకు విస్తృత ప్రచారం నిర్వహించి అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు మూడు దశల్లో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు జరుగనున్నాయి. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో అండర్-17, అండర్-23 విభాగాలకు చెందిన బాలురు, బాలికలు పాల్గొనవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా విజేతలకు మొత్తం రూ.91.90 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో
# సర్వసభ్య సమావేశం




**ముమ్మిడివరం విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద మండల పరిషత్ అధ్యక్షులు కోలా గంగాభవాని బాబ్జి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగినది. ఈ సమావేశములో వివిధ శాఖలకు సంబంధించి పలు విషయముపై రివ్యూ నిర్వహించినారు. ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు కుడిపూడి శివ శంకరరావు,వైస్ ఎంపీపీ-1 పాము నాగమణి చిట్టిబాబు,వైస్ ఎంపీపీ-2 మట్టపర్తి సురేష్, ఎంపీటీసీ సభ్యులు, ముమ్మిడివరం మండలం ప్రత్యేక అధికారి బి.గౌతమ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.ఎస్.వి.ఆర్ బ్రహ్మానందం,మండల పరిపాలనాధికారి ఎమ్.ఎస్.వి.ఎస్ శేషగిరి రావు, పలుశాఖల మండలస్థాయి అధికారులు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారిని
# దర్శించుకున్న ఎంపీ హరీష్ బాలయోగి



**మామిడికుదురు, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాల బాలాజీ స్వామిని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో వేద పండితుల ఆశీర్వచనాన్ని ఎంపీ హరీష్ కు అందించారు. అనంతరం ఆయన వెంట వచ్చిన కూటమి నాయకులు కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

# జీవో 396ని రద్దు చేయాలని నిరసన



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల ఆస్తులకు భద్రత కలిపించేందుకు జీవో 369 రద్దు చేయాలని అంబాజీపేట దస్తావేజు లేకర్లు సంఘశీ సోమవారం డిమాండ్ చేసింది. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేకర్లు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు ధర్నా చేశారు. రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయవద్దని లెకర్ల వ్యవస్థను పునరుద్దరించి తమ జీవనోపాధిని కాపాడాలని అభ్యర్థించారు.

### ప్రజా సమస్యలకు
# సత్వర పరిష్కారమే లక్ష్యం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ స్వయంగా బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి, వారి ఫిర్యాదులను ఓపికగా విన్నారు. అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 27 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అందిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపిస్తూ, నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.పోలీసు వ్యవస్థపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉండాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరించేందుకు జిల్లా పోలీసులు కట్టుబడి ఉన్నారని ఎస్పీ రాహుల్ మీనా భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ షేక్ షాబాజ్ అహ్మద్, డీపీఓ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### దుస్సాలువతో సత్కరించిన
# ముమ్మిడివరం జనసేన నాయకులు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ ప్రారంభించిన సారధుల సంచార కార్యక్రమంలో సేకరకు అమలాపురం పార్లమెంట్‌కి విచ్చేసిన పి.రమేష్ ముమ్మిడివరం జనసేన నాయకులు ఆయన గత 5 రోజులుగా చేసిన కృషికి అభినందనలు తెలియచేస్తూ ఈ రోజు చివరి రోజు భాగంగా ఆయనను దుశ్శాలువతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలాపురం చాలా మంచి మనసన్న మనుషుల ఊరు అని ఆయన కొనియాడారు.

### ప్రపంచ జూనోసిస్ దినోత్సవం
# ఉచిత రేబిస్ టీకాల పంపిణీ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం పట్టణ ప్రభుత్వ పశువైద్యశాలలో సోమవారం ఉచిత రేబిస్ నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను పంపిణీ చేశారు. జంతువులకు సకాలంలో రేబిస్ టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధిని నివారించవచ్చని, ప్రతి పెంపుడు జంతువు యజమాని దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పాల్గొన్నారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, పెచ్చెట్టి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అధికారి జయవెంకటలక్ష్మి, యువ నాయకులు కరణ్, తిక్కిరెడ్డి నేతాజీ, చింతలపూడి సత్తిబాబు, వలవల శివరావు, పశువైద్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పెంపుడు జంతువుల యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### చౌడేశ్వరస్వామి ఆలయ
# ముఖ మండపానికి శంకుస్థాపన



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలోని శ్రీ చౌడేశ్వరస్వామి ఆలయ ముఖ మండప నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


### డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో
# ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం గోడిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 5వ, 6వ తరగతులు, జూనియర్ బైపీసీ గ్రూపుల్లో మిగిలివున్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల వివరాలను పరిశీలిస్తే.. 5వ తరగతిలో 49 సీట్లు (ఎస్సీ-44, ఎస్టీ-04, ఓసీ-01), 6వ తరగతిలో 16 సీట్లు (ఎస్సీ-12, ఎస్టీ-04), మరియు జూనియర్ బైపీసీలో 06 సీట్లు (ఎస్సీ-02, ఎస్టీ-02, బీసీ-02) అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచిత వసతి, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే ఈ సంస్థలో చేరాలనుకునే ఆసక్తి గల విద్యార్థులు తమ చదువు సర్టిఫికెట్లు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు,బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలతో ఈ నెల 8వ తేదీ (08-07-2026) ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల లోపు నేరుగా వచ్చి అడ్మిషన్ పొందవచ్చు. ఇతర పూర్తి వివరాల కోసం 5వ తరగతికి డి. చంద్రశేఖర్ (9346835374), 6వ తరగతికి ఎస్. యోహాన్ (8331882301), జూనియర్ బైపీసీ కోసం పి. శేషయ్య రావు (96767554610)లను సంప్రదించాల్సిందిగా కోరడమైనది.

# 'క్యాడర్ నుంచి లీడర్'కు విశేష స్పందన

### 2,278 దరఖాస్తులు.. మంగళగిరికి తరలింపు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ చేపట్టిన 'క్యాడర్ నుంచి లీడర్' కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి స్వీకరించిన 2,278 దరఖాస్తులను సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. అమలాపురం పార్లమెంట్ పరిశీలకుడిగా వ్యవహరిస్తున్న ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా జనసేన అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో దరఖాస్తులను సీల్ చేసిన ట్రంక్ పెట్టెలో భద్రపరచి పార్టీ కేంద్ర కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, అమలాపురం పార్లమెంట్ పరిధిలో ఏడు రోజుల పాటు నిర్వహించిన 'క్యాడర్ నుంచి లీడర్' కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. పార్టీకి సేవలందించిన నాయకులు, కార్యకర్తలు, సామాజిక సేవకులు పెద్ద సంఖ్యలో తమ అర్హతలను వివరిస్తూ దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. అమలాపురం పార్లమెంట్ పరిశీలకుడిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు.

### సాగునీరు అందించాలని
# జాయింట్ కలెక్టర్‌కు రైతుల వినతి



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం చెయ్యేరు, గున్నేపల్లి గ్రామాలకు సకాలంలో సాగునీరు అందించాలని కోరుతూ సోమవారం రైతులు జేసీ వైకోమ్ నదియాదేవిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. అమలాపురం కలెక్టరేట్లో టిడిపి రైతు సంఘం అధ్యక్షుడు ఆధ్వర్యంలో రైతులు తమ సమస్యలను వివరించారు. సాగునీరు అందకపోవడం వల్ల వరి నాట్లు వేయడం కష్టంగా మారుతోందని వారు వాపోతున్నారు. దీనిపై స్పందించిన జీజ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.

# తాగునీరు వృథా అవుతున్నా పట్టించుకోరా?



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నగర పంచాయతీ వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ప్రధాన రహదారి పక్కన పైపులైను పాడైపోయి రెండు నెలలుగా తాగునీరు వృథా అవుతోంది. దీనిపై కౌన్సిలర్, స్థానికులు మొరపెట్టుకున్నా ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయించి, గృహాలకు తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

### నూతన డిఈఈ బి.రాధాకృష్ణని
# సన్మానించిన మండల టిడిపి అధ్యక్షులు అర్థాన్ని



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం పంచాయతీ రాజ్ డిఈఈగా బి.రాధాకృష్ణ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ముమ్మిడివరం మండలం టిడిపి అధ్యక్షులు అర్థాన్ని శ్రీనివాసరావు మర్యాదపూర్వకముగా రాధాకృష్ణని కలిసి ఆయనకు సాలువ కప్పి పుష్పగుచ్చాలతో రాధాకృష్ణని అభినందించారు.





# అందుకే 'కొడకల్లారా' అనాల్సి వచ్చింది : పవన్

వైసీపీ నాయకులను ఉద్దేశించి 2022-23 మధ్య తాను చేసిన వ్యాఖ్యలపై ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వివరణ ఇచ్చారు. అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన పవన్ కల్యాణ్.. వైసీపీ నేతలను ఉద్దేశించి కొడకల్లారా అని వ్యాఖ్యానించినట్టుగా వైసీపీ నాయకులు, మాజీ మంత్రులు ఇటీవల చెబుతున్నారు. వీటికి సంబంధించిన వీడియోలను కూడా వారు సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీనికి తోడు.. -నాడు మీరు చేస్తే తప్పులేదా? మీ నోటికి హద్దులేదా?" అంటూ అంబటి రాంబాబు వంటి వారు ప్రశ్నిస్తున్నారు. ఇక, సోషల్ మీడియాలో కూడా గతంలో పవన్ చేసిన అనేక వ్యాఖ్యలతోపాటు.. ఆయన చేసిన ప్రకటనల తాలూకు వీడియోలు కూడా జోరుగా వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా పవన్ కల్యాణ్ ఈ వ్యవహారంపై స్పందించారు. ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో పలువురు జనసేన నాయకులతో ఆయన మాట్లాడుతూ. ఈ విషయాన్ని ప్రస్తావించారు.



"అప్పట్లో నేను ఒకే ఒక్కసారి కొడకల్లారా అన్నాను. దానికి వాళ్లు ఇప్పుడు చాలా బాధపడిపోతున్నారు. అలా అనడానికి కూడా కారణం ఉంది. 18 మందిని అరెస్టు చేసి స్టేషన్‌లో పెట్టి హింసిస్తే.. బాధపెడితే ఇంకేమంటాం. సమయం.. సందర్భం అలా ఉంది కాబట్టే నేను అలా వ్యాఖ్యానించాను" అని చెప్పారు. అంతే కాదు.. ఆ సమయంలో కూడా.. నవ్వుతూ.. హ్యాపీగా మాట్లాడాలా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. పదుల సంఖ్యలో కార్యకర్తలను అరెస్టు చేయడం.. కేసుల్లో ఇరికించడం .. వారిని హింసించడం వంటివి ఎవరికైనా బాధ కలిగిస్తుందని తెలిపారు. అప్పట్లో తాను అన్న మాటల్లో తప్పులేదని వ్యాఖ్యానించారు. ఇది లావుంటే.. రెండు రోజుల కిందట పవన్ కల్యాణ్ సోషల్ మీడియా నూతన చట్టం గురించి.. దానిలోని విధివిధానాల గురించి వివరించారు. సామాజిక మాధ్యమం వేదిక గా.. భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డు పెట్టుకుని నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని, కఠినంగా శిక్షిస్తామని ఆయన చెప్పారు. ఈ క్రమంలో నే నాయకులపై బూతులు మాట్లాడడం.. కుటుంబాలకు చెందిన మహిళలను రోడ్డుకు లాగడం వంటివాటిని అస్సలు ఉపేక్షించేది లేదని కూడా పవన్ చెప్పారు. అనంతరం.. వైసీపీ నాయకులు, ఆ పార్టీ సోషల్ మీడియా సైతం గతంలో పవన్ చేసిన వ్యాఖ్యలు.. ఆయన వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తుండడం గమనార్హం. ఈక్రమంలోనే పవన్ కల్యాణ్ ఈవివరణ ఇవ్వడం గమనార్హం.

# జనసేనలోకి వంగవీటి కుమార్తె..?! త్వరలో పవన్‌తో భేటీ

ఏపీ రాజకీయాల్లో వంగవీటి పేరుకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఆ కుటుంబం రాజకీయాల్లో యాక్టివ్ గా ఉండాలని అభిమానులు కోరుకుంటారు. అయితే దివంగత నేత వంగవీటి మోహనరంగా తర్వాత ఆ కుటుంబంలో ఎవరూ రాజకీయాల్లో పెద్దగా రాణించలేకపోయారు. వంగవీటి భార్య రత్నకుమారి ఒకసారి, ఆయన కుమారుడు రాధాకృష్ణ మరోసారి ఎమ్మెల్యేలుగా గెలిచినా, రాజకీయంగా పట్టుసాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబం నుంచి వంగవీటి కుమార్తె ఆశాకిరణ్ రాజకీయాల్లోకి వస్తున్నారనే ప్రచారం హీట్ పుట్టిస్తోంది. అంతేకాకుండా ఆమె త్వరలో ఒక ప్రధాన పార్టీలో చేరనున్నారని కూడా చెబుతున్నారు. దీంతో వంగవీటి ఆశాకిరణ్ అడుగులు హాట్ టాపిక్ అవుతున్నాయి. గత కొంతకాలంగా తండ్రి పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న వంగవీటి ఆశాకిరణ్ రాజకీయంగా క్రియాశీలం అవ్వాలని ఆలోచిస్తున్నారని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. దాదాపు ఏడాది కాలం నుంచి రాష్ట్రంలో వివిధ కార్యక్రమాల పేరుతో పర్యటిస్తూ, తన సామాజిక వర్గ నేతలు, వంగవీటి రంగా అభిమానులను కలుస్తూ సంప్రదింపులు జరుపుతున్న ఆశాలత ఇప్పుడు ఒక పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. తన సోదరుడు రాధాకృష్ణ టీడీపీలో ఉండటంతో తాను ఎలాంటి నిర్ణయం తీసుకుంటే రాజకీయంగా ప్రయోజనకరంగా ఉంటుందనే దిశగా ఆమె చర్చలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే రాధా టీడీపీలో కొనసాగుతున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో పదవులు దక్కలేదనే అసంతృప్తితో ఉన్న ఆశాకిరణ్ కూటమిలోని జనసేనలో చేరే విషయమై సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆమె త్వరలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలవనుండటం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. రాష్ట్రంలో ఒక జిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టడంతోపాటు కృష్ణా నది ఒడ్డున రంగా ఘాట్ నిర్మించాలని ఆశాకిరణ్ కోరుతున్నారు. ఈ రెండు ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని త్వరలోనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలవనున్నట్లు ఆమె స్వయంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆశాలత జనసేనలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారనే ప్రచారం ఎక్కువైందని అంటున్నారు. ఇప్పటికే జనసేన పార్టీకి కాపు సామాజికవర్గం ఫాలోయింగు ఎక్కువగా



ఉందన్న అంచనాల నేపథ్యంలో అదే సామాజికవర్గానికి చెందిన తనకు ఆ పార్టీ మెరుగైన అవకాశాలు ఉంటాయనే ఆలోచనతోనే ఆశాలత అటువైపు అడుగులు వేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక 2029 ఎన్నికలలోపు డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తయ్యే అవకాశాలు, మహిళా రిజర్వేషన్లు అమలులోకి రానుండటం కూడా ఆశాలత రాజకీయ ప్రవేశానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తున్నట్లు భావిస్తున్నారు. నియోజకవర్గాలు పెరిగితే అవకాశాలు కూడా ఎక్కువ అవుతాయని, ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలతో పోటీ ఉండదని ఆమె భావిస్తున్నట్లు చెబుతున్నారు. అదే సమయంలో మహిళా రిజర్వేషన్ వల్ల కూడా తనకు మెరుగైన అవకాశాలు ఉంటాయని ఆమె అంచనా వేస్తున్నారని చెబుతున్నారు.

# పవన్ కళ్యాణ్‌పై సుగాలి పార్వతి ఫిర్యాదు



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు సుగాలి పార్వతి షాక్ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తన కుమార్తె కేసులో న్యాయం చేస్తామన్న హామీని నెరవేర్చలేదని పవన్ పై ఆమె గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె కేసులో తనకు న్యాయం జరగలేదని, ఈ విషయంలో పవన్ మోసం చేశారంటూ సుగాలి పార్వతి ఆరోపిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ కేసును వాడుకున్నారని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనడం తీవ్ర సంచలనంగా మారింది. కర్నూలు జిల్లాకు చెందిన సుగాలి పార్వతి గన్నవరం పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేయడం చర్చనీయాంశం అవుతోంది. తన కుమార్తె మరణానికి కారణమైన వారిని శిక్షించాలని సుదీర్ఘంగా పోరాడుతున్న సుగాలి పార్వతి ఊహించని విధంగా డిప్యూటీ సీఎంపై పోలీసులకు ఫిర్యాదు చేయడం రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ కుటుంబానికి పలు హామీలు ఇచ్చారని తల్లి పార్వతీ దేవి గుర్తు చేశారు. 'తాము అధికారంలోకి వస్తే తన కుమార్తె కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తానని, మొదటి సంతకం కూడా ఈ కేసు మీదే పెడతానని పవన్ కళ్యాణ్ గతంలో హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆయన మాట మార్చారు" అని ఆమె ఆరోపిస్తున్నారు. హామీలతో నమ్మించి, అధికారంలోకి వచ్చాక కేసును గాలికి వదిలేశారని, దీనిపై చీటింగ్, నమ్మకద్రోహం సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని ఆమె పోలీసులను కోరారు. అలాగే, న్యాయం కోసం ప్రశ్నించినప్పుడల్లా జనసేన మద్దతుదారుల ద్వారా తనపై దాడులు చేయిస్తున్నారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు, తల్లి ఆరోపణలపై పవన్ కళ్యాణ్ గతంలోనే స్పష్టమైన వివరణ ఇచ్చారని ఆయన మద్దతు దారులు చెబుతున్నారు.ఆ కుటుంబానికి న్యాయం చేయడంలో తాను ఎప్పుడూ ముందుంటానని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ కుటుంబం కన్నీళ్లు చూసి చలించిపోయి, ఆ కేసును సీబీఐకి అప్పగించేలా అప్పటి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చానని గుర్తు చేస్తున్నారు. అంతే కాకుండా, ప్రభుత్వం నుంచి బాధితులకు అందాల్సిన పరిహారం, భూమి, ఇళ్ల స్థలం తండ్రికి ఉద్యోగం దక్కాయని అంటున్నారు. జనసేన చేసిన పోరాటం వల్లే కుటుంబానికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలు అన్నీ అందాయని చెబుతున్నారు. విచారణలో జరుగుతున్న జాప్యానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యం, సాక్ష్యాల తారుమారు కారణమని, బాధ్యతాయుతమైన నాయకుడిగా తాను దోషులు శిక్షించబడాలని కోరుకుంటున్నానని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

2017లో కర్నూలు జిల్లాలోని ఒక ప్రైవేటు పాఠశాలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇది అత్యాచారం, హత్య అని ఆరోపిస్తూ తల్లిదండ్రులు పోరాటం మొదలుపెట్టగా, అప్పట్లో జనసేన అధినేతగా పవన్ కళ్యాణ్ ఆ కుటుంబానికి అండగా నిలిచి సుదీర్ఘంగా పోరాడారు. కాలక్రమేణా కేసు విచారణలో ఎదురవుతున్న అడ్డంకులు, మందగించిన విచారణ ఇప్పుడు మళ్లీ కొత్త వివాదానికి దారితీసింది. రాజకీయ నాయకుల హామీలు, బాధితుల ఆవేదనల మధ్య ఈ కేసు ఇప్పుడు ఎలాంటి మలుపు తిరుగుతుందోనన్నది ఆసక్తికరంగా మారింది.

### గర్భిణీల ఆరోగ్యానికి


# పౌష్టికాహారం కీలకం

### ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం తప్పనిసరి అని తెలిపారు. సోమవారం కోకనాడ అన్నదాన సమాజం కల్యాణ మండపంలో కేటీసీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047 మార్గదర్శి బంగారు కుటుంబాలు కార్యక్రమంలో ఆయన పాల్గొని గర్భిణీలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కేటీసీ సంస్థ ఆధ్వర్యంలో 412వ సారి ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ తల్లి-శిశు ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కేటీసీ ప్రతినిధులు, గర్భిణీలు పాల్గొన్నారు.

# పెద్దాపురం ఎస్సైగా పాపారావు నియామకం, మౌనిక వీఆర్‌కు



**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు కొత్త ఎస్సైగా పాపారావును నియమిస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన తుని ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల పెద్దాపురం మండలంలో మానసిక దివ్యాంగురాలైన మైనర్ బాలికపై లైంగిక దాడి, గర్భస్రావం జరిగిన ఘటనలో కేసు నమోదు చేయకపోవడంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణ నివేదికల ఆధారంగా, ఇంతవరకు పెద్దాపురంలో పనిచేసిన ఎస్సై వి. మౌనికను వీఆర్ కు పంపించి, ఆమె స్థానంలో పాపారావును నియమించారు.

### బీసీ గురుకుల పాఠశాలల్లో

# ఖాళీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలోని తుని, పెద్దాపురం, కరప (బాలురు), పిఠాపురం(బాలికలు) గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8వ తరగతుల ఖాళీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తి గల విద్యార్థులు జులై 6న నుంచి సంబంధిత పాఠశాలల్లో ఆధార్ కార్డుతో ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ యజ్ఞ విశ్వశాంతి మంగళవారం తెలిపారు. వార్షిక ఆదాయం రూ. 1. 20లక్షలు మించరాదన్నారు.

### ఏపి హైకోర్టులో ముగ్గురు అదనపు

# న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం







**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తమ్ కుమార్ చింతలపూడి అలియాస్ సీహెచ్ పురుషోత్తమ కుమార్‌లు సోమవారం ప్రమాణం చేశారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్లో అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురషోత్తమ్ కుమార్ చింతలపూడిలచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనియామకాలతో ఏపీ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు చేరింది. ఈకార్యక్రమంలో హైకోర్టు ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయాధికారులు, రిజిస్ట్రార్లు, న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి కూతురు డాన్స్‌తో ఆగిపోయిన వివాహం..!

ఈ మధ్య కాలంలో పెళ్లిలు ఎలాంటి కారణాలతో రద్దు అవుతున్నాయో చూస్తూ ఉంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ చిన్న విషయంతోనూ భార్యాభర్తలు విడిపోతారా అని నోరు వెళ్లబెట్టాల్సిన పరిస్థితి వస్తుంది. ఇక పెళ్లి తంతు ప్రారంభం అయిన తర్వాత కూడా కొన్ని పెళ్లిలు ఆగి పోవడం ఈ మధ్య కాలంలో చూస్తూ ఉన్నాం. పెళ్లి ఆపడం మాత్రమే కాకుండా, పెళ్లిని ఆపేందుకు ఏకంగా కాబోయే వరుడిని అమ్మాయి హత్య చేయడం కూడా మనం ఈ మధ్య కాలంలో చూశాం. పెళ్లి అంటేనే యువత భయపడే పరిస్థితి ఏర్పడింది. హిందూ సమాజం పెళ్లిని అత్యంత పవిత్రంగా భావిస్తారు. అలాంటి పెళ్లిని అవహేళన చేస్తున్న వారు ఎంతో మంది ఉన్నారు. పెళ్లి తర్వాత ప్రియుడితో లేదా ప్రియురాలితో కలిసి కట్టుకున్న వారికి కడతేర్చుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరగడం ఆందోళన కలిగిస్తుంది.

**ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాలో...**

తాజాగా హత్యలు, గొడవలు జరగలేదు. కానీ చిన్న కారణం వల్ల పెళ్లి ఆగి పోవడం చర్చనీయాంశం అయ్యింది. ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాకు చెందిన అమ్మాయితో అదే జిల్లాకు చెందిన అబ్బాయితో వివాహం ఖరారు అయ్యింది. ఇరువైపుల పెద్దలు అన్ని మాట్లాడుకుని, ఇచ్చి పుచ్చుకోవడం జరిపిన తర్వాత పెళ్లి ఏర్పాట్లు జరిగాయి. అన్ని అనుకున్నట్లుగా జరిగి ఉంటే ఆదివారం తెల్లవారుజామున వివాహం జరగాల్సి ఉంది. కాని శనివారం జరిగిన వ్యవహారం కారణంగా ఆదివారం వివాహం జరగలేదు. శనివారం రాత్రి వధువరులు కళ్యాణ మండపంకు జతగా తరలి వెళ్తున్న సమయంలో డీజే స్టెప్స్‌తో బంధుమిత్రులు హడావిడి చేశారు. ఆ సమయంలోనే వధు వరులతోనూ డాన్స్



చేయించాలని కొందరు భావించారు. అందుకు వరుడు ఒప్పుకోలేదు.

**పెళ్లి బరాత్‌లో డాన్స్ చేసేందుకు...**

డాన్స్ చేసేందుకు అస్సలు ఒప్పుకోని పెళ్లి కొడుకును వదిలేసి పెళ్లి కూతురుతో డాన్స్ చేయించేందుకు మిత్రులు కొందరు ప్రయత్నించారు. ఆ సమయంలోనే డాన్స్ చేస్తే ఊరుకునేది లేదంటూ గట్టిగా వధువును వరుడు తిట్టాడని స్థానికులు చెబుతున్నారు. దాంతో అతడి ప్రవర్తనకు అంతా విస్తు పోయారని, అమ్మాయి సైతం చిన్నబుచ్చుకుని కంట తడి పెట్టుకున్నట్లుగా తెలుస్తోంది. డాన్స్ వేయాలని ఆశ పడ్డ అమ్మాయిని అతడు అడ్డుకోవడం, అంతే కాకుండా అమ్మాయిని గట్టిగా మందలించడం అక్కడున్న వారిని ఆశ్చర్యపరిచింది. అమ్మాయి తండ్రి మాత్రం అతడి ప్రవర్తనకు ఆగ్రహంతో ఊగి పోయాడు. పెళ్లికి ముందే ఇలా కట్టడి చేస్తే పెళ్లి తర్వాత తన కూతురును ఇంకెంత ఇబ్బందులకు గురి చేస్తాడో కదా అనుకున్నాడేమో, నువ్వు వద్దు, నీతో నా కూతురుకు పెళ్లి వద్దు అనుకుని వధువును తీసుకుని అక్కడ నుంచి వెళ్లి పోయాడట.

**పెళ్లి క్యాన్సల్ కావడంతో...**

పెళ్లి కోసం వరుడు పెద్ద మొత్తంలో ఖర్చు చేశాడని, అంతే కాకుండా పెళ్లి కోసం వందలాది మందిని పిలిచాడట. పెట్టిన ఖర్చు ఇతర లెక్కలు అన్నింటిని తేల్చుకుని మొత్తం పెళ్లిని కాన్సల్ చేసుకున్నారట. కట్నాలు, కానుకలు ఇలా అన్నింటిని సైతం లెక్కలు తేల్చుకుని, ఎవరికి వారే అన్నట్లుగా ఎవరి ఇంటికి వారు వెళ్లి పోయారు. పెళ్లి అనే పెద్ద తంతును కేవలం చిన్న కారణం వల్ల ఇలా రద్దు చేసుకోవడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. కొందరు మాత్రం అతడిని ఆ అమ్మాయి పెళ్లి చేసుకోవడం మంచిది అయిందని, పెళ్లి చేసుకుని ఉంటే భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కొని ఉండేదేమో అంటున్నారు. మరికొందరు మాత్రం ఈ చిన్న విషయానికి పెళ్లి క్యాన్సల్ వరకు తీసుకుని వెళ్లకుండా ఉండాల్సింది. అతడిని తర్వాత తర్వాత మార్చుకునే అవకాశం ఉంటుంది కదా అని కొందరు అంటున్నారు. మరి ఈ పెళ్లి ఆగిపోవడంపై మీ అభిప్రాయం ఏంటి?

# మూగజీవాల సంరక్షణతోనే ప్రజారోగ్య భద్రత

## జూనోసిస్ నివారణకు వ్యాక్సినేషన్ అత్యంత కీలకం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవిచౌక్ సమీపంలోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జూనోసిస్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి, రేబిస్ నిరోధక వ్యాక్సిన్ వేశారు. అనంతరం వెటర్నరీ వైద్యులు, సిబ్బంది, కూటమి నాయకులు, జంతు ప్రేమికులు, దాతలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం అత్యంత అవసరమన్నారు. జంతువులను ప్రేమగా చూసుకోవడం ఎంత ముఖ్యమో, వాటి ద్వారా సంక్రమించే వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోనే ప్రత్యేకంగా రాజమహేంద్రవరం వెటర్నరీ ఆసుపత్రిలో జంతువులతో పాటు మనుషులకు కూడా రేబిస్ వ్యాక్సినేషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తంగా ఉండి వ్యాక్సిన్ తీసుకోవడం ఉత్తమమైన విధానమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వెటర్నరీ ఆసుపత్రిలో ఉన్న మౌలిక సదుపాయాల లోటును గుర్తించి, ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో జంతువులకు ఎక్స్‌రే, స్కానింగ్ వంటి పరీక్షలు చేయించాలంటే విజయవాడ వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం సుమారు రూ.57 లక్షల సీఎస్ఆర్ నిధులతో అత్యాధునిక ఎక్స్‌రే, స్కానింగ్ పరికరాలను ఏర్పాటు చేయడంతో స్థానికంగానే పరీక్షలు నిర్వహించి వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించే అవకాశం ఏర్పడిందన్నారు. అదే విధంగా కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా ఆధునిక ఆపరేషన్ థియేటర్‌ను కూడా సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అభివృద్ధికి సహకరించిన ఆదిరెడ్డి అప్పారావు, అబ్బు, ఎస్‌బీ గ్రూప్‌కు చెందిన రంగప్రసాద్, రాము, సురేష్ కుటుంబ సభ్యులు తదితర దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జంతు సంక్షేమం కోసం రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌లో కూడా యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్కడ కూడా మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచినట్లు వివరించారు. మూగజీవాలకు కూడా మనుషులతో సమానంగా జీవించే హక్కు ఉందని, వాటికి మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వాల బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ సహకారంతో పాటు దాతల సహాయ సహకారాలను సమీకరించి వెటర్నరీ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తామని, జంతు సంక్షేమానికి అవసరమైన ప్రతి చర్యను చేపడతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మజ్జి రాంబాబు, అబ్బు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి

### కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం జాంపేట పరిధిలోని 114, 115, 116 పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తును ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఒక్క ఓటరూ నమోదు అవకాశాన్ని కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి, అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఓటరు జాబితా సవరణను సమర్థవంతంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఓటర్లందరూ తమ పేరు ఎన్నికల జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన కోరారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సందేహాలు ఉంటే బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌వోలు) సహకారం తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక శిబిరాల ద్వారా నగరపాలక సంస్థ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మల్లవరం-కొత్తపల్లి రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా మేజిస్ట్రేట్ మరియు నీటిపారుదల శాఖ అధికారుల ఆదేశాల మేరకు, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తగినంత వర్షపాతం నమోదయ్యే అవకాశం తక్కువగా ఉన్నందున రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచించారు. మల్లవరం, కొత్తపల్లి గ్రామాల రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, వర్షాధారంగా వరి సాగు చేసే రైతులు వరికి బదులుగా మినుము లేదా నువ్వులు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే బోరు నీటి సౌకర్యం ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలని కోరారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ పామ్ మొక్కలను పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పొలంలో గుంతలు తవ్వి మొక్కలు నాటే పనులను ఎం.జి.నరేగా పథకం ద్వారా చేపడతారని వివరించారు. ఆయిల్ పామ్ సాగు ప్రారంభించిన రైతులకు తొలి నాలుగు సంవత్సరాల పాటు మినుము, పెసర, కోకో వంటి అంతర పంటల సాగుకు అవసరమైన సహాయాన్ని ఉద్యానవన శాఖ అందిస్తుందని తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ సేద్య పరికరాలను కూడా రాయితీపై అందజేస్తారని, మొదటి నాలుగు సంవత్సరాలు ఎరువులపై రాయితీ ఉంటుందని చెప్పారు. ఐదవ సంవత్సరం నుంచి ఆయిల్ పామ్ గెలలను కంపెనీ నేరుగా కొనుగోలు చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేస్తుందని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం తక్కువగా ఉండటంతో పాటు వరి పంటతో పోలిస్తే అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులందరూ తమ వివరాలను రైతు సేవా కేంద్రం లేదా ఉద్యానవన శాఖ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతు యాప్ ద్వారా యూరియా పంపిణీ విధానాన్ని కూడా వివరించారు. మల్లవరం గ్రామానికి చెందిన కొంతమంది కౌలు రైతులు తమకు కౌలు రైతు కార్డులు వెంటనే జారీ చేయాలని కోరగా, ప్రతి గ్రామంలోని గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో) కౌలు కార్డులు జారీ చేస్తారని, వాటి ఆధారంగానే రైతు యాప్ ద్వారా యూరియా పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# డివైడర్‌ను ఢీకొన్న సిమెంట్ బల్క్ లారీ



### తప్పిన పెను ప్రమాదం

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మం డలం రాపాక తూముల వద్ద ఉదయం కోదాడ నుండి పోలవరం ప్రాజెక్టుకు సిమెంట్ లోడుతో వెళుతున్న సిమెంట్ బల్క్ లారీ డివైడర్ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ ఒకవైపు చక్రాలు ఊడి పోయాయి. జనసంచారం లేక పోవడం కారణంగా పెను ప్రమాదం తప్పింది. ప్రమాదానికి డ్రైవరు నిద్రమత్తు కారణమని తెలిసింది.

### ఎస్‌బిఐ వినియోగదారుల కోసం

# ఈ -వెహికిల్ ఛార్జింగ్ పాయింట్

**ఎస్‌బిఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పటేల్**
**అమరావతి సర్కిల్‌లో ఎస్‌బిఐ రాజమహేంద్రవరంలోనే ప్రప్రథమంగా ప్రారంభం**
**పర్యావరణ పరిరక్షణకు ఎస్‌బిఐ వేసిన ముందడుగు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరూ ప్రత్యామ్నాయ ఇందన వనరులను ఉపయోగించుకోవలసిందేనని ఎస్‌బిఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పటేల్ అన్నారు. స్థానిక కంబాల చెరువు ఎస్‌బిఐ పరిపాలనా కార్యాలయంలో విద్యుత్ వాహన చార్జింగ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణకు, వినియోగదారుల సేవా నిబద్ధతకు ఎస్‌బిఐ వేసిన ముందడుగు ఇది అని అయన అన్నారు. ఎస్‌బిఐ సర్కిల్‌కు చెందిన ముగ్గురు జనరల్ మేనేజర్లు ప్రఫుల్ల కుమార్ జెనా, కుందన్ జ్యోతి, విశాల్ సక్సేనా, రాజమహేంద్రవరం డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ మరియు ఎస్బిఐకి చెందిన ఇతర ప్రముఖుల సమక్షంలో ఈ చార్జింగ్ స్టేషన్ ఘనంగా ప్రారంభం అయింది. రాజమహేంద్రవరం ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఛార్జింగ్ స్టేషన్లో నాలుగు చక్రాల మరియు రెండు చక్రాల వాహనాల కోసం నాలుగు పాయింట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.. ఈ ఛార్జింగ్ స్టేషన్ ప్రత్యేకంగా ఎస్బిఐ గౌరవనీయ వినియోగదారుల కోసం కేటాయించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ రాజమహేంద్రవరం ప్రాంతీయ మేనేజర్ టి.శ్రీనివాస్, హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ టి.శ్రీధర్, ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ ఎన్.వి.వి. స్వామి మరియు పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వగుర్తింపు లేని పాఠశాలలపై కఠిన చర్యలు

### ఎంఈవో సుబ్రహ్మణ్యం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్బన్ మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) ఎమ్‌విఎమ్ సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లావిద్యాశాఖాధికారి(డీఈఓ) కంది వాసుదేవరావు ఆదేశాల మేరకు ఈ అంశం పై పలు సూచనలు జారీ చేశారు. మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ గుర్తింపు ఉత్తర్వులు లేకుండా ఎలాంటి తరగతులు నిర్వహించకూడద న్నారు. ఏడో తరగతి వరకు మాత్రమే అనుమతి ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, తదుపరి ఉన్నత తరగతుల నిర్వహణకు ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా క్లాసులు నడపరాదన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా, నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా పాఠశాలలు లేదా అదనపు తరగ తులు నిర్వహిస్తే సదరు పాఠశాలల గుర్తింపును రద్దు చేయడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్ఈవో స్పష్టం చేశారు.అలాగే.. పాఠశాల ప్రాంగణం లో బుక్స్, యూనిఫామ్ వంటివి అమ్మరాదన్నారు. ప్రైవేటు పాఠశాలల విషయం లో తల్లి తండ్రులు తమ సమస్యను రాత పూర్వకంగా తమ దృష్టికి తేవలెనన్నారు.

# ప్రేమ ఓడింది.. పగ రగిలింది..

### భీమవరంలో టెకీ దారుణ హత్య



**తాడేరు (భీమవరం గ్రామీణ), విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన యువతి కొత్తపల్లి అనంత వాణి(32) దారుణ హత్యకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న అనంతవాణి తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో సుమారు ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి ఇంటి నుంచి ఉద్యోగం (వర్క్‌ఫ్రం హోం) చేస్తున్నారు. సమీప గ్రామం కొత్రపాడుకు చెందిన ఆటో డ్రైవర్ తాడేపల్లి శ్యామ్‌బాబుతో ఆమెకు స్నేహం ఏర్పడి ప్రేమగా మారింది. శ్యామ్‌బాబుకు గతంలోనే వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలియడంతో అతడిని ఆమె దూరం పెట్టారు. పగ పెంచుకున్న శ్యామ్‌బాబు ఆదివారం తెల్లవారుజామున ఆమె ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు. తలుపు తీసిన వెంటనే పదునైన కత్తితో దాడిచేసి పరారయ్యాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అనంతవాణిని స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఆమె తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్సై వైవీ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

**కుటుంబానికి ఆమే ఆధారం**

అనంతవాణి తండ్రి దివ్యాంగుడు, తల్లి అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. ఆమె ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులను పోషిస్తున్నారు. బ్యాంకు రుణం తీసుకుని ఇల్లు కూడా నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. అనారోగ్యంతో ఉన్న తల్లిని దగ్గరుండి చూసుకునేందుకే స్వగ్రామానికి వచ్చారు. దాడి సమయంలో తల్లిదండ్రులు అక్కడే ఉన్నా అడ్డుకునే స్థితిలో వారు లేరని స్థానికులు తెలిపారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

## ఐశ్వర్య రాజేష్, తిరువీర్ జంటగా

# 'ఓ సుకుమారి'




ఐశ్వర్య రాజేశ్, తిరువీర్ జంటగా నటించిన 'ఓ సుకుమారి' సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. ఫాంటసీ అంశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని జులై 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్వర రెడ్డి మూలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజకీయ నాయకుడు కావాలనుకునే ఓ యువకుడు, సుకుమారి (ఐశ్వర్య రాజేష్) అనే పల్లెటూరి అమ్మాయి ప్రేమలో పడతాడు. అయితే ఆమెను ఎవరు తాకినా షాక్ కొట్టడం అనే విచిత్రమైన సమస్య చుట్టూ కథనం హాస్యభరితంగా, ఆసక్తికరంగా సాగుతుందని తెలుస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ దశలో ఉంది. తెలుగుతో పాటు తమిళం, ఇతర భాషల్లోనూ ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యు/ఎ సర్టిఫికెట్ రావడంతో ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందని అంచనాలు నెలకొన్నాయి.

## ఒక్క యాక్సిడెంట్ అంతా మార్చేసింది..
## లేకుంటే స్టార్ హీరోయిన్ అయ్యుండేది..

# ఇప్పుడిప్పుడే బిజీ అవుతున్న భామ



కొత్త అందాలు ఎప్పటికప్పుడు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. సినిమా సినిమాకు కొత్త హీరోయిన్స్ పరిచయం అవుతున్నారు. ఇదే సమయంలో కొందరు హీరోయిన్స్ ఒకటి రెండు సినిమాలతోనే పాపులర్ అవుతున్నారు. చాలా మంది హీరోయిన్స్ ఓవర్ నైట్ లోనే స్టార్ గా మారిపోయారు. కానీ కొంతమంది మాత్రం ఎంత ప్రయత్నించినా కూడా స్టార్ డమ్ దక్కించుకోలేకపోతున్నారు. అలాంటి వారిలో పైన కనిపిస్తున్న భామ ఒకరు. తన అందంతో కుర్రాళ్లను మాయలో పడేసింది ఈ చిన్నది. అలాగే నటనలోనూ మంచి మార్కులు కొట్టేసింది ఈ బ్యూటీ. ఈ చిన్నది చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అయ్యాయి. కెరీర్‌లో ఒకే ఒక్క భారీ హిట్ అందుకుంది ఆ బ్యూటీ. కెరీర్ పీక్‌లో ఉండగానే యాక్సిడెంట్ కు గురయ్యింది. అదృష్టం కొద్దీ ప్రాణాలతో బయటపడింది. దాదాపు రెండేళ్లు బెడ్‌కే పరిమితం అయ్యింది.ఇంతకూ ఈ ముద్దుగుమ్మ ఎవరో తెలుసా.? వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారింది పై ఫొటోలో ఉన్న భామ. కెరీర్ స్టార్టింగ్ లోనే భారీ హిట్ అందుకుంది. ఆతర్వాత కొన్ని ఫ్లాప్స్ అందుకుంది. కెరీర్ పీక్‌లో ఉండగానే యాక్సిడెంట్‌కు గురయ్యింది. ఆమె ఎవరంటే అందాల నభా నటేష్. నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. సుధీర్ బాబు హీరోగా నటించిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. పూరిజగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా భారీ హిట్ అందుకోవడంతో పాటు కలెక్షన్స్ కూడా భారీగా రాబట్టింది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలు అందుకుంది. అయితే ఈ అమ్మడికి అవకాశాలు క్యూ కడుతున్న సమయంలో ఊహించని విధంగా రోడ్డు ప్రమాదానికి గురయ్యింది. ఈ ప్రమాదంలో నభా తీవ్రంగా గాయపడింది. దాంతో ఆమె రెండేళ్లు బెడ్ పైనే ఉండాల్సి వచ్చింది. ఇక కోలుకున్న తర్వాత తిరిగి సినిమాలతో బిజీగా మారింది. మొన్నామధ్య డార్లింగ్ అనే సినిమా చేసింది కానీ ఆ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. తాజాగా నాగబంధం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నాగబంధం సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. అలాగే ఇప్పుడు స్వయంభు సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ చిన్నది సోషల్ మీడియాలో చురుకుగా ఉండే నభా.. హాట్ హాట్ ఫొటోలతో కుర్రాళ్లను కవ్విస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన కొన్ని ఫోటోలు నెట్టింట సెగలు రేపుతున్నాయి.

# సంజూ శాంసన్‌పై వేటు.. జింబాబ్వే సిరీస్‌కు టీమిండియా ప్రకటన

జింబాబ్వే టీ20 సిరీస్‌కు బీసీసీఐ యువ జట్టును ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఎంపిక కాగా, సంజూ శాంసన్‌కు చోటు దక్కలేదు. ఇషాన్ కిషన్ రీఎంట్రీ ఇవ్వగా, పలువురు యువ ఆటగాళ్లకు తొలిసారి టీమిండియా తరఫున అవకాశం లభించింది. బీసీసీఐ జింబాబ్వే పర్యటనకు వెళ్లే 15 మంది సభ్యులతో కూడిన సరికొత్త టీమిండియా జట్టును అధికారికంగా ప్రకటించింది. జూలై 23 నుంచి ప్రారంభం కానున్న ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం సెలెక్టర్లు యంగ్ బ్లడ్‌ను నమ్ముకున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న సీనియర్ ఆటగాళ్లలో చాలా మందికి ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఈ యువ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, యువ ఆల్‌రౌండర్ తిలక్ వర్మకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించారు. ఈ సిరీస్ ద్వారా భవిష్యత్తు టీ20 జట్టును నిర్మించడమే లక్ష్యంగా బీసీసీఐ అడుగులు వేస్తోంది. ఈ జట్టు ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే.. సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ పేరు ఈ స్క్వాడ్‌లో లేకపోవడం. గత కొన్ని ఇన్నింగ్స్‌లుగా వరుసగా విఫలమవుతూ వస్తున్న సంజూపై సెలెక్టర్లు వేటు వేశారు. అతనితో పాటు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్,




హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి ఆటగాళ్లను కూడా ఈ పర్యటనకు ఎంపిక చేయలేదు. సంజూ శాంసన్ స్థానంలో ఇషాన్ కిషన్ తిరిగి వికెట్ కీపర్‌గా జట్టులోకి రాగా, బ్యాకప్ కీపర్‌గా ప్రభ్‌సిమ్రన్ సింగ్‌కు మళ్లీ పిలుపు వచ్చింది. 2023 ఆసియా క్రీడల తర్వాత ప్రభ్‌సిమ్రన్ భారత జట్టులోకి రావడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన ద్వారా పలువురు అన్‌క్యాప్డ్ ఆటగాళ్లకు భారత జట్టు తరఫున ఆడే సువర్ణ అవకాశం దక్కింది. దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన యష్ ఠాకూర్, అశోక్ శర్మలు తొలిసారి భారత టీ20 జట్టుకు ఎంపికయ్యారు. అలాగే గంటకు 150 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో బౌలింగ్ చేయగల టీమిండియా యువ స్పీడ్‌స్టర్ మయాంక్ యాదవ్ గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి చేరాడు. 2024లో చివరిసారిగా భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మయాంక్.. తన పేస్ పవర్‌తో జింబాబ్వే బ్యాటర్లను భయపెట్టేందుకు సిద్ధమయ్యాడు. వీరితో పాటు హర్ష్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, ప్రిన్స్ యాదవ్ వంటి నయా యువ ఆటగాళ్లకు కూడా ఈ జట్టులో చోటు దక్కింది. ఈ పర్యటనలో భాగంగా భారత్, జింబాబ్వే జట్ల మధ్య మొత్తం మూడు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లన్నీ జింబాబ్వే రాజధాని హరారేలోని క్లబ్ మైదానంలోనే జరగడం విశేషం. జూలై 23న మొదటి టీ20 మ్యాచ్, జూలై 25న రెండో టీ20 మ్యాచ్, జూలై 26న మూడో చివరి టీ20 మ్యాచ్ జరగనున్నాయి. వరుస రోజుల్లో మ్యాచ్‌లు ఉండటంతో ఆటగాళ్ల ఫిట్‌నెస్ ఈ సిరీస్‌లో చాలా కీలకం కానుంది. సీనియర్లు లేకపోయినా అభిషేక్ శర్మ, రింకూ సింగ్, వైభవ్ సూర్యవంశీ వంటి హిట్టర్లతో కూడిన ఈ యంగ్ టీమిండియా జింబాబ్వేను వారి సొంత గడ్డపైనే చిత్తు చేస్తుందని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




# వరల్డ్ క్రికెట్ బాస్ ఆస్ట్రేలియా..

## పురుషులు, మహిళలు కలిపి ఏకంగా 24 ఐసీసీ ట్రోఫీలతో రికార్డు



మహిళల టీ20 వరల్డ్ కప్ 2026 గెలిచిన ఆస్ట్రేలియా మొత్తం 24 ఐసీసీ ట్రోఫీలతో ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానాన్ని మరింత బలోపేతం చేసింది. పురుషులు, మహిళల జట్ల విజయాలతో ఆసీస్ రికార్డులు సృష్టించగా, భారత్ 9 ఐసీసీ ట్రోఫీలతో రెండో స్థానంలో కొనసాగుతోంది. ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఆస్ట్రేలియా జట్టుకు ఉన్న క్రేజ్, సక్సెస్ రేట్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐసీసీ టోర్నమెంట్లు వచ్చాయంటే చాలు ఆసీస్ ప్లేయర్లు సింహాల్లా విరుచుకుపడుతుంటారు. తాజాగా ముగిసిన 2026 మహిళల టీ20 వరల్డ్ కప్ టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ఖాతాలో సరికొత్త మైలురాయి చేరింది. పురుషుల, మహిళల జట్లను కలిపి ఆస్ట్రేలియా ఇప్పటివరకు ఏకంగా 24 ఐసీసీ ట్రోఫీలను గెలుచుకుని ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన దేశంగా అగ్రస్థానంలో నిలిచింది. ఈ రేసులో భారత్ 9 ట్రోఫీలతో రెండో స్థానంలో ఉన్నప్పటికీ, ఆసీస్ సాధించిన రికార్డుకు, మనకు మధ్య రెట్టింపు కంటే ఎక్కువ వ్యత్యాసం ఉండటం గమనార్హం. లండన్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జరిగిన హోరాహోరీ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళల జట్టు ఇంగ్లాండ్‌ను 7 వికెట్ల తేడాతో ఘోరంగా ఓడించి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 151 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ మహిళలు కేవలం 17.1 ఓవర్లలోనే ఛేదించి ఏడోసారి టీ20 ప్రపంచ కప్‌ను ముద్దాడారు. ఈ విజయంతో ఆస్ట్రేలియా మహిళల జట్టు మొత్తం ఐసీసీ ట్రోఫీల సంఖ్య 14కు చేరింది. ఆస్ట్రేలియా పురుషుల జట్టు కూడా తక్కువ ఏమీ తినలేదు, వారు ఇప్పటివరకు 10 ఐసీసీ టైటిళ్లను గెలిచారు. ఈ విధంగా రెండు విభాగాల్లోనూ ఆసీస్ జట్లే ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఐసీసీ ట్రోఫీలు (పురుషులు, మహిళలు కలిపి) గెలిచిన దేశాల జాబితాను ఒకసారి పరిశీలిస్తే ఆస్ట్రేలియా ఎంత పటిష్టమైన స్థితిలో ఉందో అర్థమవుతుంది. ఆస్ట్రేలియా 24 ట్రోఫీలతో ఎవరికీ అందనంత ఎత్తులో ఉండగా, టీమిండియా 9 ట్రోఫీలతో రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ 8 ట్రోఫీలతో మూడో స్థానంలో ఉండగా, వెస్టిండీస్, న్యూజిలాండ్ జట్లు చెరో 4 ఐసీసీ ట్రోఫీలతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఫామ్, ట్రాక్ రికార్డ్ చూస్తుంటే భవిష్యత్తులో ఏ జట్టుకైనా ఆస్ట్రేలియా రికార్డును బద్దలు కొట్టడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. ఆస్ట్రేలియా సాధించిన ఈ 24 ఐసీసీ ట్రోఫీల ప్రస్థానం చాలా అద్భుతమైనది. ఆసీస్ మహిళల జట్టు ఏకంగా 7 సార్లు వన్డే వరల్డ్ కప్ (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022), 7 సార్లు టీ20 వరల్డ్ కప్ (2010, 2012, 2014, 2018, 2020, 2023, 2026) గెలుచుకుంది. ఇక ఆసీస్ పురుషుల జట్టు 6 సార్లు వన్డే వరల్డ్ కప్ (1987, 1999, 2003, 2007, 2015, 2023), 2 సార్లు ఛాంపియన్స్ ట్రోఫీ (2006, 2009), ఒకసారి టీ20 వరల్డ్ కప్ (2021), ఒకసారి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (2021-2023) టైటిళ్లను కైవసం చేసుకుని మెగా టోర్నీల కింగ్‌గా నిలిచింది. మన భారత క్రికెట్ జట్టు కూడా ఐసీసీ టోర్నీలలో పలుమార్లు అద్భుత విజయాలను నమోదు చేసింది. టీమిండియా పురుషుల జట్టు 3 సార్లు టీ20 వరల్డ్ కప్ (2007, 2024, 2026), 2 సార్లు వన్డే వరల్డ్ కప్ (1983, 2011), 3 సార్లు ఛాంపియన్స్ ట్రోఫీ (2002, 2013, 2025) గెలుచుకుని భారత అభిమానులకు ఎన్నో మధుర జ్ఞాపకాలను అందించింది. అలాగే భారత మహిళల జట్టు కూడా 2025 లో జరిగిన వన్డే వరల్డ్ కప్ టైటిల్‌ను సొంతం చేసుకుని దేశ కీర్తి పతాకాన్ని ఎగురవేసింది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com